ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం ఓటు




విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జాయింట్ కలెక్టర్

3

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కల్గివుండాలి జేసీ ధర్మారెడ్డి
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



మేడ్చల్

బుధవారం 2 ఆగస్టు 2017 | 20




మహిళల కోసం ప్రభుత్వం మరో నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. పేద మహిళలకు, చేనేతకు చేయూత అందించనుంది. అదే బతుకమ్మ చీరల పంపిణీ. దసరా పర్వదినం నుంచి 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ ఈ పథకం కింద చేనేత చీరలను పంపిణీ చేయనుంది. క్రిస్మస్‌కు క్రైస్తవులకు, రంజాన్‌కు ముస్లిం పేదలకు ఉచితంగా ప్రభుత్వం దుస్తులను పంపిణీ చేస్తోంది. విజయదశమికి హిందువులకు చేనేత చీరలు అందించేందుకు కార్యాచరణ రూపొందించింది. జిల్లాలో 5.09 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నట్టు ప్రాథమిక అంచనా. ఒక్కో చీరకు రూ.200 నుంచి 500 వరకు వ్యయం కానుంది. త్వరలో లబ్ధిదారుల ఎంపిక కమిటీలను నియమించనున్నారు.

- పేద మహిళలకు, చేనేతకు సర్కారు చేయూత
- జిల్లాలో దాదాపు 5.09 లక్షలమంది లబ్ధిదారులు
- గ్రామాల్లో, పట్టణాల్లో త్వరలోనే ఎంపిక కమిటీలు
- సభ్యులుగా పంచాయతీ కార్యదర్శులు/మునిసిపల్ శాఖ అధికారులు,వీఆర్వో, ఎస్‌హెచ్‌జీలు
- చీరల నిల్వ కోసం గోదాముల ఎంపిక
- ఆగస్టు నెలాఖరులోగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయం
- సెప్టెంబర్ 13 నుంచి చీరల పంపిణీకి శ్రీకారం

బతుకమ్మ చీరలు



వార్త 7లో...



కరెంట్ కష్టాలతో

సతమతం

- లోఓల్టేజీ సమస్యతో జనం ఇబ్బందులు
- చిన్నపాటి గాలికే విద్యుత్‌కు అంతరాయం
- మరమ్మతులు చేయాలని గ్రామస్థుల ఫిర్యాదు
- ఆరు నెలలైనా పట్టించుకోని అధికారులు

9

సర్పంచ్, మాజీ కార్యదర్శికి

షోకాజ్ నోటీసులు

7

మేడ్చల్‌లో బ్రిడ్జి నిర్మాణానికి 6

రైల్వే ఇంజనీర్ల బృందం స్థల పరిశీలన

జిల్లాలో ఇక రైతులు పట్టాదారు పాసుపుస్తకాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని పోస్టులోనే నేరుగా రైతింటికి పాసుపుస్తకాలు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని కలెక్టర్ ఎంవీ రెడ్డి తెలిపారు. కండ్లకోయ అనుబంధ గ్రామమైన సుతారిగూడలో రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న భూ క్రమబద్ధీకరణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. నేరుగా వ్యవసాయ భూముల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు.



7

పక్కాగా రికార్డులు

వంట.. మంట



- వంట గ్యాస్‌కు మంగళం..
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై పెనుభారం
- సబ్సిడీ సిలిండర్‌పై ప్రతి నెలా రూ.4కు పెంచుతూ చివరకు స్వస్తి
- సామాన్యులకు వంట గ్యాస్ మంటగా మారుతున్న వైనం

గ్యాస్ ధరకు రెక్కలు రానున్నాయి. వంట గ్యాస్ సిలిండర్‌పై క్రమంగా ధరను పెంచుతూ సబ్సిడీని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం సబ్సిడీని తొలగించేందుకు సిలిండర్‌పై నెలనెలా రూ.4 పెంచాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై మోయలేని భారం పడనుంది. ఒకేసారి కాకుండా ప్రతి నెలా రూ.4 పెంచుతూ.. రాయితీకి మంగళం పలుకనుంది.

ఆంధ్రజ్యోతి / ఇంటర్వ్యూ

పోకిరీల ఆట కట్టించేందుకే 'షీటీమ్స్'


- వికారాబాద్ జిల్లాలో మూడు బృందాలు
- క్షణికావేశాలతోనే భార్యభర్తల మధ్య గొడవలు
- కౌన్సెలింగ్‌కే తొలి ప్రాధాన్యం
- రాజీ కుదరకపోతేనే కేసులు
- జిల్లా మహిళా పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో, జిల్లా షీటీమ్ ఇన్‌చార్జి నిర్మల



వికారాబాద్ అర్బన్: షీ బృందాలను చాలా పకడ్బందీగా జిల్లాలో నిర్వహిస్తున్నాం. సబ్ డివిజన్‌కు ఒక బృందం వంతున జిల్లాలో మొత్తం మూడు షీ బృందాలు పనిచేస్తున్నాయి. ఒక్కొక్క షీ బృందంలో ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. అందులో ఒక హెడ్‌కానిస్టేబుల్, ముగ్గురు కానిస్టేబుళ్లు, ముగ్గురు హోంగార్డులు, ఒక మహిళా కానిస్టేబుల్ ఉంటారు. వీరు నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటూ పోకిరి వేషాలు వేసే వాళ్లపై నిఘా ఉంచుతారు. ఎక్కువగా రద్దీ ఉండే బస్టాండ్, రైల్వేస్టేషన్ వంటి ప్రాంతాలతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద వీరు మఫ్టీలో ఉండి పోకిరీల ఆగడాలపై నిఘా పెడతారు. ఇప్పటి వరకు జిల్లాలో రెండు కేసులు నమోదు చేయడం జరిగింది. అందులో ఒకటి నవాబుపేట మండలం ఎక్‌మామిడిలో కాగా, వికారాబాద్‌లో మరో కేసు నమోదైంది. పదుల సంఖ్యలో షీ బృందాలు పట్టుకొచ్చిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతోంది. కౌన్సిలింగ్ ఇచ్చిన తరువాత కూడా ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై ఖచ్చితంగా కేసు నమోదు చేయడం జరుగుతుంది. ఇందుకోసం ప్రతి కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం వికారాబాద్ పట్టణంలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో షీటీమ్ బృందాల పనితీరు, నిర్వహణపై అవగాహన కల్పిస్తూ అర్థమయ్యే విధంగా తెలియజేస్తున్నాం. ఈ విషయంలో జిల్లా ఎస్పీ అన్నపూర్ణ ప్రత్యేక చొరవ తీసుకొని షీటీమ్స్‌ను ముందుకు నడిపిస్తున్నారు. వికారాబాద్ తరువాత జిల్లాలోని అన్ని మండలాల్లో, వసతి గృహాల్లో షీటీమ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. యువతీ, యువకులకు టీనేజీలో జరిగే అనర్థాలు, ఆ తరువాత ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించడం జరుగుతోంది. తప్పు చేసిన వారు తప్పించుకునే ప్రసక్తి లేదు. ఇందుకోసం పోలీసు యంత్రాంగం తరపున సీసీ కెమేరాలు, షీటీమ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాలో వికారాబాద్‌లోనే ఏకైక మహిళా స్టేషన్ ఉంది. దీంతో ఎక్కువ శాతం ఇక్కడకు అత్తమామలు, వరకట్నం వేధింపులు, భర్త వేధింపులకు సంబంధించిన కేసులు ఇక్కడకు వస్తుంటాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తరువాత అక్కడ పరిష్కారం కాని పక్షంలో ఇక్క డకు ఫిర్యాదుదారులు వస్తుంటారు. ఎక్కువ శాతం క్షణికావేశం, భార్య భర్తలు ఒకరినొకరు అర్థం చేసుకోక పోవడం వల్ల వివాదాలు తలెత్తుతుంటాయి. అలాంటి వారికి ఇక్కడ కౌన్సిలింగ్ ఇస్తాం. రెండుసార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా తమ తీరు మార్చుకోకుంటే వారు కోరిన విధంగా కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడం జరుగుతుంది. ఈ మధ్య జరిగిన లోక్ అదాలత్‌లో వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ నుంచి 42 కేసులను రాజీ కుదర్చడం జరిగింది. లోక్ అదాలత్ ద్వారా ఒకసారి కేసు కొట్టివేయడం జరుగుతుంది. రాజీ కుదుర్చుకోవడం ద్వారా కక్షిదారులకు సమయంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుంది. ఈ విధంగా రాజీ మార్గాన్ని ఎంచుకుని కేసులను పరిష్కరించుకుంటున్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు మహిళా పోలీస్ స్టేషన్‌కు 297 ఫిర్యాదులు రాగా అందులో 220 ఫిర్యాదులను కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించగా, 37 కేసులు నమోదు చేశాం. వీలైనంత వరకు కేసులను రాజీ కుదిర్చేందుకే ప్రయత్నిస్తుంటాం. వీనని పక్షంలో వారి ఫిర్యాదులను స్వీకరించి కేసు నమోదు చేయడం జరుగుతుంది.

బిందుసేద్యానికి అడ్డుకట్ట

- మరమ్మతు లేక పైపుల్లో పేరుకుపోతున్న కాల్షియం
- నిర్వహణను పట్టించుకోని అధికారులు



చౌదర్‌పల్లిలో డ్రిప్‌తో సాగవుతున్న కూరగాయల తోట

యాచారం: సూక్ష్మ బిందుసేద్యం పరికరాల మరమ్మతుల బాధ్యతను ఆయా కంపెనీలు విస్మరించడంతో రంగారెడ్డి జిల్లాలోని రైతుల అవస్థలు పడుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ సాగు చేయడం అనే నినాదంతో రంగారెడ్డి జిల్లాలో 2003 సంవత్సరంలో (మైక్రోఇరిగేషన్‌ప్రాజెక్టు) సూక్ష్మ సేద్యాన్ని అమల్లోకి తెచ్చారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై రైతులకందిస్తున్నారు. ఈ సూక్ష్మ బిందు సేద్యం మెయింటెన్స్ సరిగ్గా లేక రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. చాలా మంది రైతులకు డ్రిప్ మెయింటెన్స్‌ను కంపెనీలు విస్మరించడంతో రైతులే తోటి రైతుల సూచనలతో బాగు చేసుకుంటున్నారు.

పరికరాల సరఫరా ఇలా

రంగారెడ్డి జిల్లాలో రాయితీపై 2003 నుంచి బిందుసేద్యం పథకం ప్రారంభమైంది. ఐదేళ్ల వ్యవధిలో 3వేల హెక్టార్లలో బిందుసేద్యం పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా వాటి ఉపయోగం, వినియోగం మాత్రం చాలా పేలవంగా ఉంది.

ఇలా మారుతున్నాయ్..

బిందుసేద్యం పరికరాలకు సంబందించి నీటిని మొక్కలకు అందించే కీలకమైన పైపుల్లో నీటిలోకలిగి ఉండే కాల్షియం, మెగ్నీషియం, వంటి టీడీఎస్ లవణాలు పేరుకుపోయి గడ్డకడుతున్నాయి. ఫలితంగా పైపుల నుంచి నీరు సాఫీగా వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి.

ఏం చేయాలంటే..

పైపుల్లో పేరుకుపోయిన కాల్షియం, మెగ్నీషియం లవణాల గడ్డలు, పైపులు ఫిల్టర్ల నుంచి తొలగించేందుకు కనీసం ఏడాదికి ఒక్కసారైన యాసిడ్ ట్రీట్‌మెంట్ ద్వారా శుభ్రం చేయాలి.

ఎవరు చేయాలి..

యాసిడ్ ఖర్చులు రైతులే భరించినా టెక్నిషియన్ల సేవలను మాత్రం వీటిని అమర్చిన కంపెనీలే రైతులకు ఉచితంగా ఐదేళ్లపాటు అందించాల్సి ఉంది. ఐదేళ్ల నుంచి రైతులకు ఆయా సంస్థలు ఈ సేవలను అందించడం మానేశాయి.

ముందుకు రాని కంపెనీలు

కూరగాయల సాగు, పండ్లతోటల సాగుకు బిందుసేద్యం పరికరాలు అమర్చుతున్నారు. రైతులకు ఆయా కంపెనీల సేవలందక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. పొలంలో బిందుసేద్యం పరికరాలు అమర్చింది మొదలు ఏళ్లు గడిచినా మళ్లీ ఆయా కంపెనీల ప్రతినిధులు తమ వైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఐదేళ్లు ఉచిత సేవలు అందించాలి

బిందుసేద్యం పరికరాలు అమర్చిన తరువాత ఐదేళ్ల పాటు ఆయా కంపెనీలు వీటి నిర్వాహణ విషయంలో ఏసమస్య వచ్చినా ఐదేళ్లు ఉచితంగా సేవలందించాల్సి ఉంది. ఈ విష యంలో ఉధ్యానవనశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పడేస్తున్నారు..

చాలా గ్రామాలలో డ్రిప్‌ల మెయింటెన్స్ సరిగ్గా లేక పోవడంతో డ్రిప్ పరికరాలు పాడైపోయి పొలానికి నీరందించడం లేదు. డ్రిప్ పరికరాలు మరమ్మతులకు గురికావడంతో వాటిని రైతులు తొలగిస్తున్నారు. పైప్ నీరు పోయకపోవడంతో మరమ్మతు చేసే విషయం తెలియక రైతులు వాటిని తొలగించి పాడేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

అన్నదాతలకు బిందుసేద్యం పరికరాలను సరఫరా చేసిన కంపెనీలు ప్రతి మూడు నెలలకోమారు యాసిడ్ ట్రీట్‌మెంట్ చేసి రైతులకు చూపాలి. రైతు కోరిన ప్రకారంగా పైపులను శుద్ధి చేసి చూసి నీరు రాని పరిస్థితుల్లో వాటిని తొలగించి కొత్త పైప్‌లందించాలి. డ్రిప్‌లు బాగున్నాయా లేదా అనేది చూడాల్సిన ఉద్యానవనశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇక్కడే అధికం


యాచారం మండలంలోని గడ్డమల్లాయాగూడ, గున్‌గల్, మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి గ్రామాలలో మాత్రమే కూరగాయలసాగు అధికంగా చేస్తున్నారు. గడ్డమల్లాయాగూడ గ్రామంలో డ్రిప్ పని చేయని కొందరు రైతులు వారే కెమికల్ తెచ్చుకొని బాగు చేసుకున్నారు. ఇక్కడ వెంకటరెడ్డి అనే రైతు స్వత హాగా భారీ గడ్డ ఏర్పాటు చేసి దానిపై నీటి టాంకు కట్టి దాంట్లోకి నీరు పెట్టి డ్రిప్ యంత్రం పెట్టి కూర గాయలు సాగు చేసుకుంటున్నారు.



మేమే బాగు చేసుకుంటున్నం

మేమే డ్రిప్ పైపులను బాగు చేసుకుంటున్నం. సూది లేదా దాని సమానమైన పరికరంతో డ్రిప్ పైప్‌లో ఇరుకున్న వ్యర్థాలను తొలగించి బాగు చేసుకుంటున్నం. డ్రిప్ పైప్ పాడైనట్లు కంపెనీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి డ్రిప్ పరికరాలు కొంటే కంపెనీ అధికారులు బాగు చేయడం లేదు.

- గౌరనర్సింహ, చౌదర్‌పల్లి సర్పంచ్, రైతు



కంపెనీ వాళ్లకు చెప్పినా బాగు చేయరు

డ్రిప్ పాడైనట్లు డ్రిప్ కంపెనీ అధికారులకు తెలిపినా వారు రారు.. చూడరు. ఊర్ల తోటి రైతులనడిగి బాగు చేసుకుంటున్నం. చాలా మటుకు పాడైన డ్రిప్ పైప్‌లు పారేస్తున్నారు. కాలం చెల్లిన వాటి స్థానంలో కొత్తగా పైప్‌లు ఇవ్వాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు. గింత అన్యాయం ఎక్కడ లేదు.

- నారాయణ రైతు చౌదర్‌పల్లి



అన్ని విధాల ఆదుకుంటున్నం

ఏయే రైతు ఏకంపెనీ నుంచి డ్రిప్ పైప్‌లు కొన్నారో తెలుసుకొని వాటిని ఆయా కంపెనీల చేత బాగు చేయించడం కోసం చర్యలు తీసుకుంటున్నం. డ్రిప్ పైప్‌లు రైతులే బాగు చేసు కోవడం బాధేస్తుంది. ఇక నుంచి కంపెనీల అధికారులతో డ్రిప్‌ను బాగు చేయించడం కోసం చర్యలు తీసుకుంటాం.

- యాదగిరి డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి

ఉపవాసం చేసేది ఎందుకో తెలుసా..



బషీరాబాద్ : ఉప అనగా సమీపం అని, వాసం అనగా నివసించడం అని అర్థం. ఉపవాసమనగా దేవతా సమీపంలో గడపడం అని అర్థం. భారతీయ సంస్కృతి ప్రకారం ప్రతి నెలలో రెండుసార్లు వచ్చే ఏకదశి తిథితో పాటు మహాశివరాత్రి, కృష్ణాజన్మాష్టమి, రామ నవమి వంటి పర్వదినాల్లో సైతం ఉపవాసం ఉండటం సంప్రదాయం. దాంతో పాటు ఇష్టదేవత, కులదేవతలకు సంబంధించిన రోజుల్లో సైతం ఉపవాసం ఉండటం వల్ల మానసిక ప్రశాంతత, శరీరక విశ్రాంతి లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఉపవాసం ఉండే రోజుల్లో ఆయా దేవుళ్లకు ఇష్టమైన పదార్థాలు నివేదించి వాటినే స్వీకరించడం ద్వారా దేవుళ్ల కృపకు పాత్రులవుతారు. ఉపవాసం ఉన్న రోజుల్లో శక్తి మేరకు అతి తక్కువ ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఏకాగ్రతను పొందడమే కాకుండా పలు వ్యాధుల నుంచి విముక్తులవుతారు. నిరాహారం, జలాహారం ఫలహారాలతో ఉపావాసాలుండటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. కనీసం ప్రతి పదిహేను రోజులకోకసారి ఉపవాసం పేరిట మితాహారం తీసుకోవడం వల్ల జీర్ణ వ్యవస్థకు అవసరమైన విశ్రాంతి దొరుకుతుంది. ఫలితంగా అది మరింత ఉత్తేజంగా పనిచేయగలుగుతుందని సైన్స్ సైతం నిరూపించడం మనకు తెలుసు.

- జయరాంచారి, అర్చకులు హనుమాన్ మందిర్ బషీరాబాద్

ఏకీకృత సర్వీస్‌రూల్స్‌తో పర్యవేక్షణ పటిష్ఠం కావాలి

- ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎండీ. రహీంఖాన్

ఉద్యోగపర్వం



వికారాబాద్ రూరల్: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీస్‌రూల్స్‌కి రాష్ట్రపతి ఆమోద ముద్రతో తెరపడింది. వెంటనే ఇన్‌చార్జి పాలనను తొలగించాలి. విద్యాశాఖలో నెలకొన్న తీవ్రమైన కొరత సమసి పోయేలా చూడాలి. విద్యాశాఖ పరిధిలోని ఉపాధ్యాయులందరికీ పదోన్నతులు, స్థాన చలనాలు జరపాలి. ఆగిపోయిన డిప్యూటీ ఈవో, ఎంఈవో, డైట్ లెక్చరర్ల తదితర పర్యవేక్షణ పోస్టుల భర్తీని ప్రభుత్వం చేపట్టాలి. విద్యా వ్యవస్థలో బలోపేతం చేయాలి. రాష్ట్ర పునర్విభజన ఏఈ/సెక్షన్ 97 ప్రకరం 71(డి)ని రాష్ట్రానికి ఉపయోగించుకునే క్యాడర్లను కొత్తగా నిర్వహించుకునే అవకాశం కల్పించాలి. అన్ని సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సర్వీస్‌రూల్స్ అమలుపై చర్చించి పదోన్నతులు కల్పించాలి. ప్రతి పాఠశాలకు ఒక నైట్ వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలి. 2006, 2012 సీపీఎస్ విధానాన్ని తొలగించి ఉపాధ్యాయులకు పెన్షన్ విధానం కల్పించాలి. ఈ విద్యాసంవత్సరానికి మధ్యాహ్న భోజన బిల్లులు మంజూరు చేయాలి.

వృత్తి విద్యా కోర్సుల్లో

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కీసర రూరల్: పలు వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ పొందేందుకు మైనారిటీ యువత నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ వెల్ఫేర్ శాఖ అధికారి విజయలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీ స్కిల్స్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్, బ్యూటీషియన్, డ్రైవింగ్(ఎల్ఎంవి, హెచ్ఎంవి), పారామెడికల్ కోర్సు, సాలర్-ఇ-మిల్లట్ ట్రస్ట్, కమ్యూనిటీ టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, సెట్విన్ సంస్థల ద్వారా పలు కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అసక్తి గలవారు జిల్లా కలెక్టరేట్‌లోని మైనారిటీ కార్యాలయంలో, 9676789460 ఫోన్‌నెంబర్లల్లో సంప్రదించాల్సిందిగా ఆ ప్రకటనలో తెలిపారు.

బీఈడీ, డీఈడీల విద్యార్థులకు

నష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలి



కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్‌తో మాట్లాడుతున్న ఎంపీ మల్లారెడ్డి

దుండిగల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీఈడీ, డీఈడిల నియామకాల్లో చేపడుతున్న విధి విధానాల తేడాల వలన విద్యార్థులు ఒక సంవత్సర కాలం వృథా అయ్యే ప్రమాదం ఉందని ఈ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ మల్కాజిగిరి ఎంపి ఛామకూర మల్లారెడ్డి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి ప్రకాశ్‌జవదేఖర్‌ను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేసారు. తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు బీఈడి, డీఈడి కళాశాలల యాజమాన్యాల సమాఖ్య ప్రతినిధులతో కలిసి మంత్రిని కలిసారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఒక సంవత్సరం తరువాత ప్రవేశపెట్టిన నూతన భోధనా విధానం అద్భుత ఫలితాలు ఇస్తుందని కానీ రాష్ట్రంలో సాధారణంగా నూతన నియామకాలు ఏప్రిల్ నుంచి జూన్‌లోపు జరుగడం వలన విద్యార్థులు వారి కేరీర్‌లో ఒక సంవత్సరం వృథా చేసుకుంటున్నారని ఎంపీ పేర్కొన్నారు. అదేవిధంగా అక్రిడేషన్ విధానాన్ని కూడా రెండు సంవత్సరాలు వాయిదా వేయాలని కోరారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యం సమస్యలను పరిష్కరించేందుకు ఒక కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయాలని మంత్రి ఎంపీని కోరారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు బీఈడి, డీఈడి కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు సూరం ప్రభాకర్‌రెడ్డి, డా. కే. రామ్‌దాస్, జి. రాజేష్, జే. నారాయణన్, తమిళనాడునుంచి ఆర్.టి. శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలని కేసీఆర్‌సేవా దళం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అమీర్ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం శాగంటి సాయికుమార్ గౌడ్‌ను కేసీఆర్ దళం మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో ఎస్.వేణుగోపాల్, కేసీఆర్ సేవాదళ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకట్‌రెడ్డి. సిటీ ప్రధానకార్యదర్శి సలీం తదితరులు పాల్గొన్నారు. **-కీసర రూరల్**



లారీ-కారు ఢీ విద్యుత్ ఏఈకి గాయాలు

కీసర: లారీ కారు ఢీకొనడంతో మండల విద్యుత్ ఏఈకి గాయాలు అయిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కీసర నుంచి కుషాయిగూడకు స్విఫ్ట్ కారులో మండల విద్యుత్ ఏఈ స్వామి వెళ్తుండగా కుషాయిగూడ నుంచి అతి వేగంగా వస్తున్న లారీ స్వామి కారు ఢీ కోట్టింది. దీంతో స్వామికి తీవ్ర గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సురేందర్ గౌడ్ తెలిపారు.

'చిన్నారులకు టీకాలు వేయించాలి'

మేడ్చల్ : చిన్నారులకు రుబెల్లా, మీజిల్స్ వ్యాధుల నివారణకు టీకాలను తప్పకుండా వేయించాలని మండల వైద్యాధికారి పద్మావతి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు.

ఇంటింటి సర్వేకు సహకరించాలి

- **నేటి నుంచి వీఆర్‌వోల ఇంటింటి సర్వే**
- **తప్పులు సరిచేసుకునేందుకు అవకాశం**
- **సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఎం.వీ.రెడ్డి**

కీసర రూరల్: ఇంటింటి సర్వేకు అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వి.రెడ్డి జిల్లా రైతులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో భూముల సర్వే, రికార్డుల అప్‌డేషన్‌పై తహసీల్దార్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల భూ వివరాలను తెలుసుకునేందుకు నేటి నుంచి వీఆర్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు వెల్లిడించారు. పట్టాదారు పేర్లు, అనుభవంధార్ పేరు, విస్తీర్ణం విషయంలో తప్పులు ఉన్నట్లయితే రైతులు సరిచేసుకునేందుకు వీలుగా ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా వివరాలు సేకరించి క్రోడీకరించిన అనంతరం గ్రామసభలో ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరించి తుది జాబితాను రూపొందించడం జరుగుతుందన్నారు. వెబ్‌ల్యాండ్‌నుంచి 1బీని డౌన్‌లోడ్ చేసుకుని సవరణలు చేసిన అనంతరం ఆ కాపీని రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో నిర్ధేశించిన తేదీల్లో వెళ్లి సర్వే నిర్వహించే విషయం ఉందుగా రైతులకు తెలియపరచాలని సూచించారు. రెవెన్యూ అధికారులు గ్రామాలకు వచ్చిన సమయంలో రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందుబాటులో ఉంచుకోవాలని రైతులకు సూచించారు. ఇతర గ్రామాల్లో నివాసముండే రైతులు ఈ సర్వే సందర్భంగా వారి భూ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఇంటింటి సర్వేకు వచ్చే వీఆర్‌ఓలకు రైతులు సహకరించి తమ భూముల వివరాల్లో ఏమైనా పొరపాట్లు ఉన్నపక్షంలో సరిచేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జా యింట్ కలెక్టర్ ధర్మారెడ్డి, డీఆర్‌ఓ సురేందర్‌రావు, ఆర్‌డీఓలు హనుమంత్‌రెడ్డి, మధుసూదన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాంచందర్, తహసీల్దార్‌లు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వీ.రెడ్డి

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

కీసర రూరల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్లర్ యం.వి.రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన మేడ్చల్ జిల్లాలో మొదటిసారిగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. వేడుకల సందర్భంగా పాఠశాల విద్యార్తులచే మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలని నిర్వహించడంతో పాటు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రోత్సాహకాలను లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక కార్యక్రమాలపై స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉద్యోగులకు వివిధ అంశాలలో క్రీడా పోటీలను నిర్వహించాలని ఆదేశించారు. వివిధ శాఖలలో అత్యుత్తమ సేవలందించిన వారి వివరాలను రేపటి వరకు సమర్పించాలన్నారు. వేడుకలకు విచ్చేసే విద్యార్థులకు, ప్రముఖులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్యశాఖ స్టాల్‌ను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వహణ, సాంస్కృతిక, ఆతిథ్యం, క్రీడ తదితర కమిటీలను వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ధర్మారెడ్డి, డీఆర్వో సురేందర్‌రావు, ఆర్డీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుది కీలకపాత్ర : జేసీ

మేడ్చల్: 18సంవత్సరాలు నిండిన ప్రతీ విద్యార్థి తప్పకుండా ఓటు హక్కు కల్గివుండాలని ఓటు హక్కు లేని వారు నమోదు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రెవెన్యూ అధికారులతో కలిసి విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ ఓటు పాత్ర తదితర అంశాలపై వివరించారు. విద్యార్థుల సందేహాలను జేసీ నివృత్తి చేశారు. ఓటు ద్వారా మంచి నాయకుడిని ఎంచుకోవచ్చని తద్వారా మంచి సమాజాన్ని నిర్మించుకోవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదన్నారు. విద్యార్థులు ఓటు ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు కూడా వివరించాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యత అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహశిల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్ఐ నాగజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్నజేసీ ధర్మారెడ్డి

వృక్షాలే మానవులకు ప్రాణవాయువు : ఎంపీపీ

శామీర్‌పేట: నేడు మనం నాటుతున్న మొక్కలే వృక్షాలుగా ఎదిగి మానవులకు ప్రాణ వాయువు నిచ్చి కాపాడుతాయని ఎంపీపీ చంద్రశేఖర్ అన్నారు. హరిత హారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం శామీర్‌పేట మండలం తూంకుంట పరిధిలోని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ క్యాంపస్‌లో ఎంపీపీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్ ఉపాధ్యాయులు, కోచ్‌లు, విద్యార్థులు కలిసి 5000 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వృక్షాలు మానవాళి మనగడకు ఎంతో కీలకంగా ఉపయోగపడుతున్నాయని వివరించారు. నేడు మనం నాటిన మొక్కలే పెద్ద, పెద్ద వృక్షాలుగా ఎదగడం వల్లే వర్షాలు కురుస్తాయని ఆయన చెప్పారు. వృక్షాలే వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించి సమతుల్యంగా ఉంచుతుందని ఎంపీపీ విద్యార్థులకు వివరించారు. విద్యా సంస్థల్లోని విద్యార్థులతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ స్పందిస్తూ ముందుకు వచ్చి మొక్కలను నాటడం, వాటిని సంరక్షించడం భాద్యతగా గుర్తించాలని ఎంపీపీ పిలుపు నిచ్చారు.



రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ క్యాంపస్‌లో మొక్కలను నాటుతున్న ఎంపీపీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

6న మున్నూరుకాపు

జిల్లా సంఘం మహాసభ

శామీర్‌పేట: శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తా వద్ద ఈ నెల 6న మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆ సభ కన్వీనర్ మామిండ్ల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన శామీర్‌పేటలో విలేకరులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేములవాడ రాజరాజేశ్వరీ ఆలయ నిత్య అన్నదానం ఛైర్మన్ కొండ దేవయ్య, సంఘం రాష్ట్ర నాయకుడు పుటం పురుషోత్తమ్, తదితర నాయకులు విచ్చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మహాసభకు మేడ్చల్ జిల్లాలోని మున్నూరుకాపు సంఘానికి చెందిన వారందరూ తప్పని సరిగా విచ్చేసి విజయవంతం చేయాలని శ్రీనివాస్ పిలుపు నిచ్చాచు.



ఎల్ఐసీ 60 సంవత్సరాలవార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఓల్డ్ అల్వాల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు మైక్‌సెట్‌ను బహూకరించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సంధ్యారాణిజ, ఎల్ఐసీ అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ ఈశ్వరన్, చైర్మన్ విఠల్‌మూర్తి, మహేష్ తదితరులు పాల్గొన్నారు. - (అల్వాల్).

పార్కుల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు, కార్పొరేటర్
- వాకింగ్ ట్రాక్‌లు, గ్రీనరీ, టెన్నిస్ కోర్టుల కోసం పరిశీలన



వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్

మల్కాజిగిరి: జీహెచ్ఎంసీ మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని మల్కాజిగిరి డివిజన్ పరిధిలో పార్కుల అభివృద్ధికిగాను అధికారులు, కార్పొరేటర్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా విష్ణుపురి కాలనీలోని పోచమ్మ ఆలయం ఆవరణలోని పార్కు. విష్ణుపురిలోని మరో పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధిచేసి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే సర్కిల్ పరిధిలోని అనేక పార్కులు, ప్రభుత్వ ఆధీనంలోని స్థలాలు కబ్జాలకు గురికాగా ఉన్న కాస్త స్థలాలను, పార్కులను అభివృద్ధి చేసేందుకు గాను అధికారులు చర్యలు చేపడుతున్నారు.

గ్రీనరీతో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు

విష్ణుపురిలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో గల పార్కును అన్ని విధాలుగా అబివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం పార్కులో రూ 6 లక్షల వ్యయంతో పార్కు చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు పార్కు మధ్యలో చుట్టూ పచ్చదనం ఉట్టిపడేలా ఉండేందుకుగాను గ్రీనరీని ఏర్పాటుచేస్తున్నారు. సీనియర్ సిటిజన్లు, కాలనీ ప్రజలు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు, బెంచీలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. త్వరలోనే ఈ పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి స్థానికులకు అందించనున్నారు.



విష్ణుపురిలోని పార్కులో టెన్నిస్ కోర్టు ఏర్పాటుకు పరిశీలిస్తున్న అధికారులు, కార్పొరేటర్

షెటిల్ కోర్టుగా మరో పార్కు

ఇదే కాలనీలోని మరో పార్కులో అభివృద్ధితో పా టు యువతకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకుగాను, వ్యాయామం చేసేందుకుగాను షెటిల్ కోర్టును, మరిన్ని క్రీడా పరికరాలు ఏర్పాటు చేసేందకు కావాల్సిన ప్రణాళికలు సిద్ధం చేశారు. త్వరలోనే ఈ పార్కును అందరికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.

ఆదర్శ డివిజన్‌గా మల్కాజిగిరి..



మల్కాజిగిరి డివిజన్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా ఉంచేందుకుగాను అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాం. ఇందులో భాగంగానే అధికారులు, కాలనీవాసులు, కాలనీ సంక్షేమ సంఘాలను కలుపుకుని వారికి ఏమేమి కావాలో వాటిని ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తున్నాం. మౌలిక సదుపాయాలతో పాటు అభివృద్ధిలో అన్నింటా అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తున్నాం.

- జగదీష్‌గౌడ్, కార్పొరేటర్

పారదర్శకతతో జీఎస్టీ అమలు

- ఎలాంటి అపోహలు వద్దు
- రిజిస్ట్రేషన్లు మరింత సరళతరం చేసేందుకు ఇక ఈసేవా కేంద్రాల్లోనూ అనుసంధానం



జీఎస్టీపై అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న సోమేష్‌కుమార్ (ఐఏఎస్)

మల్కాజిగిరి : దేశంలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పారదర్శకంగా జీఎస్టీని అమలు చేస్తున్నామని వాణిజ్య పన్నుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సోమేష్‌కుమార్ స్పష్టంచేశారు. మంగళవారం మల్కాజిగిరిలో యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోటల్ తాజ్‌మహల్‌లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వ్యాపారులు, వినియోగదారులకు జీఎస్టీ అమలుపై ఉన్న అనేక సందేహాలను నివృత్తి చేశారు. సంవత్సరానికి 20 లక్షల టర్నోవర్ ఉన్న వ్యాపారస్థులు, తయారీదారులు తప్పనిసరిగా జీఎస్టీ ట్రేడ్ లైసెన్సులు పొందాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా మీరు నా ద్వారా వాటిని నివృత్తి చేసుకోవచ్చని అన్నారు. గతంలో అయితే ఆ పన్ను ఈ పన్ను అంటూ మనకు తెలియకుండానే దాదాపుగా 40 రకాలుగా పన్నులు ఉండేవని వాటన్నింటిని ఇప్పుడు కేవలం జీఎస్టీతో ఒకే విధమైన పన్ను విధానాన్ని అమలుచేస్తున్నారని అన్నారు. జీఎస్టీ దేశంలోనే ఓ గొప్ప ప్రక్రియ అని ఆయన తెలిపారు.

త్వరలోనే ఈ సేవా కేంద్రాలకు అనుసంధానం

ఇకపై జీఎస్టీని మరింత సరళతరంగా ఉండేందుకుగాను ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా జీఎస్టీని ఈ సేవా కేంద్రాలకు అనుసంధానం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సోమేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రతిది కంప్యూటర్ ద్వారానే చేసుకునేందుకు వీలుగా ఈ జీఎస్టీని అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజలు దీన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ , యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్సియల్ అసోసియేషన్ ప్రతినిధి బీటీ శ్రీనివాస్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన వ్యాపారులు, వినియోగదారులు, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

నేరేడ్‌మెట్ : మల్కాజిగిరి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి తగిన చర్యలు తీసుకొన్నామని ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి అన్నారు. మంగళవారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని శ్రీకాలనీలో 20 లక్షల రూపాయలు, సప్తగిరి కాలనీలో 20 లక్షల రూపాయలు మొత్తం 40 లక్షల రూపాయల సిసి రోడ్ల పనులను ఆయన ముఖ్యఅతిదిగా ప్రారంభించారు. అనంతరం బృందావన్ కాలనీలో పార్కును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పోరేటర్ కటికనేని శ్రీదేవి గ్రేటర్ కోఆప్షన్ సభ్యురాలు గొట్టిముక్కల జ్యోతిగౌడ్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు జికె హనుమంతురావు, శంకర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, కె శ్రీనివాస్, బాబురావు, ఉమర్‌ఖాన్, శ్రీనివాసరెడ్డి, జాన్, గంగాదర్, సాయినరేష్, శ్రీదర్, జయానంద్ ఇతర నాయకులు మునిసిపల్ డిసి వేణుగోపాల్, ఇఇ పి అనిల్‌రాజ్, డిఇ సువర్ణ, ఎఇ కౌశిక్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శశి కాలనీల వాసులు పాల్గొన్నారు.

దోభీఘాట్‌లు ఏర్పాటుచేయాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ ఎంవీరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రజక సంఘ సభ్యులు

మౌలాలి : రజక కులస్థులు తమ సమస్యలను పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డిని కోరినట్లు తెలంగాణ రజక(దోభి) అభివృద్ధి సంస్థ సభ్యులు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డిని తెలంగాణ రజక(దోభి) అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలువురు కలసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రోజు రోజుకు చెరువులలో నీరు కలుషితం అవుతుండడంతో బట్టలను ఉతకటానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీంతో కులవృత్తినే నమ్ముకుని నేరేడ్‌మెట్, ఆర్కేపురంపరిధిలో నివాసం ఉంటున్న సుమారు 300 కుటుంబాలు రోడ్డునపడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. మా కుల వృత్తుల సంక్షేమానికి నేరేడ్‌మెట్ పరిధిలో ఎకరం స్థలం కేటాయించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. సుధాకర్, నేరేడ్‌మెట్ శాఖ అధ్యక్షుడు దామగల్ల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి పులిమామిడి రమేష్, కార్యదర్శి శంకర్, కోశాధికారి ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు లంకల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరిస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవడాన్ని హర్షిస్తూ మంగళవారం మౌలాలి సబ్‌స్టేషన్‌లో కేసీఆర్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ సభ్యులు చందు, ధన్శిరాం, జార్జి కింగ్, సంజీ, నరేష్, బాలనర్సింహ, శ్యామ్, రాజు, జానయ్య, అకుల, హిమజ, నర్సింగరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు. - మౌలాలి



పులుమద్దిలో పర్యటిస్తున్న జాన్సన్

'హరితహారం' మొక్కలను రక్షించాలి

● జియో ట్యాగింగ్ వేగవంతం చేయాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి జాన్సన్

వికారాబాద్ అర్బన్ : హరితహారం మొక్కలను ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా రక్షించుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి జాన్సన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పులుమద్ది గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న మొక్కలను పరిశీలించారు. అక్కడ నాటిన మొక్కలను జియోట్యాగింగ్ చేసే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్జాలంలో మొక్కలను అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. జియో ట్యాగింగ్ ఏ విధంగా చేస్తున్నారనే వివరాల గురించి ఆయన ఈజీఎస్ ఈసీ జ్యోతి, టీఏ జంగయ్య, ఏపీవో సుధాకర్‌లను ప్రశ్నించారు. నాటిన ప్రతి మొక్కను జియో ట్యాగింగ్ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం, గ్రామంలో ఇంటింటికి తిరిగి ఇళ్ల ముందు నాటిన మొక్కలను పరిశీలించారు. అదే విధంగా అక్కడ తయారు చేసిన విత్తన బంతులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వేణుగోపాల్, ఎంపీడీవో సత్తయ్య, సర్పంచ్ శ్వేత, ఎంపీటీసీ వెంకటయ్య, ఏపీవో సుధాకర్, ఏపీఎం లక్ష్మయ్య, సాక్షర భారత్ కోఆర్డినేటర్లు రమేష్, సుమిత్ర, గ్రామస్తులు శివయ్య, భుజంగం, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలకు ప్రత్యేక శిబిరం

బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ జాన్సన్ అన్నారు. మంగళవారం మదన్‌పల్లిలో బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధాన ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పంట రుణాలకు సంబంధించిన బ్యాంకు ఖాతా కాకుండా మరో బ్యాంకు ఖాతాను తెరుచుకోవాలని, ఆ ఖాతాను ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. రైతులుపంటల కోసం తీసుకున్న రుణాల బకాయిల కింద బ్యాంకర్లు ఉపాధి కూలీ డబ్బులు మినహాయించుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బ్యాంకు అధికారులు రైతుల కూలీ డబ్బులను అప్పు కిందకు జమ చేసుకోవద్దని అక్కడే ఉన్న ఫీల్డ్ అఫీసర్‌కు ఆయన సూచించారు. రైతుల పంట రుణాల డబ్బులు ఉంటే పంటలు చేతికొచ్చే సమయానికి వెళ్లి తెచ్చుకోవాలని అన్నారు. రైతులు పంట రుణ ఖాతా కాకుండా పొదుపు ఖాతాను తప్పకుండా తెరిచి ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మణెమ్మ, ఎంపీడీవో సత్తయ్య, ఏపీవో సుధాకర్, ఏపీఎం, ఫీల్డ్ అసిస్టెంట్ రాంచంద్రయ్య పాల్గొన్నారు.

మర్పల్లి కేజీబీవీకి తాళం..

సహచర విద్యార్థిని మృతితో ఇళ్లకు వెళ్లిన విద్యార్థినులు

మర్పల్లి : మర్పల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి తాళం పడింది. ఈ విద్యాలయంలో తొమ్మిదోతరగతి చదువుతున్న విద్యార్థిని హారిక ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో అక్కడ చదువుతున్న మిగతా విద్యార్థులు భయాందోళనకు గురై ఇంటి ముఖం పట్టారు. విద్యార్థినులు అందరూ తమ ఇళ్లకు వెళ్లడంతో కస్తూర్బా విద్యాలయానికి తాళం పడింది. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులు 200 మంది ఉన్నారు. తమ సహచర విద్యార్థిని విద్యాలయం ఆవరణలోనే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో మిగతా విద్యార్థినులు ఎంతగానో మనోవేదనకు గురయ్యారు. నిత్యం తమతో కలిసి ఉండే హారిక ఆత్మహత్య చేసుకోవడంతో తాను మృతి చెందిన కళ్ల ముందే మెదలడంతో విద్యార్థినులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. సోమవారం పోలీసుల హడావిడి, నాయకులు ధర్నాలు, అధికారుల ప్రశ్నలతో విద్యార్థినులు మరింత ఆందోళనకు గురయ్యారు. దీంతో విద్యార్థినులు తమ కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి తమను ఇళ్లకు తీసుకు వెళ్లాలంటూ కంటతడి పెట్టారు. జరిగిన సంఘటన తెలుసుకున్న తల్లిదండ్రులు విద్యాలయానికి వచ్చి తమ పిల్లలను ఇళ్లకు తీసుకు వెళ్లారు. మంగళవారం మిగతావారు ఇళ్లకు వెళ్లిపోవడంతో కేజీబీవీకి తాళం పడింది. పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో ఉపాధ్యాయులు పాఠశాలలో ఉండి ఇంటిముఖం పట్టారు.

కూలీల ఖాతాలకు 'ఆధార్'

ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు అనుసంధానం

కూలి డబ్బులు బ్యాంకుల్లోనే..

ఖాతా లేని కూలీలకు

కొత్త ఎకౌంట్ తెరిపించేలా చర్యలు

సెప్టెంబర్ 10లోగా పూర్తి చేసేలా కార్యాచరణ

గ్రామాల వారీగా అవగాహనా శిబిరాలు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, వికారాబాద్)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో 1,84,919 ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉండగా, 4,29,916 మంది కూలీ పనులు చేస్తున్నారు. వీరిలో శ్రమశక్తి సంఘాల్లో 3,15,433 మంది కూలీలు నమోదయ్యారు. ఉపాధి హామీ కూలీల్లో ఇంత వరకు 2,68,037 మంది కూలీలు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోగా, 47,316 మంది కూలీలు ఇంకా తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉంది. ఇదిలా ఉంటే, కూలీల్లో ఇప్పటి వరకు 2,29,631 మంది కూలీలు తమబ్యాంకు ఖాతాల వివరాలను తమ జాబ్ కార్డులో నమోదే చేసుకోగా, ఇంకా 85,802 మంది కూలీలు తమ బ్యాంకు ఖాతాల వివరాలు అందజేయాల్సి ఉంది. బ్యాంకు ఖాతా లేని ఉపాధి కూలీలతో కొత్తగా బ్యాంకు ఖాతా తెరిపించి ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు కూలీలకు ఉన్న బ్యాంకు ఖాతాల్లో ఒక ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసేందుకు మంగళవారం నుంచిజిల్లాలో ప్రత్యేక శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఒక్కో కూలీ పేరిట రెండు నుంచి నాలుగు వరకు వివిధ బ్యాంకుల ఖాతాలు ఉన్నాయి. ఒకటికంటే ఎక్కువ ఉన్న బ్యాంకు ఖాతాల్లో ఏదైనా ఎంపిక చేసుకున్న బ్యాంకు ఖాతాకు వారి ఆధార్ సంఖ్యను అనుసంధానించనున్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చెల్లింపులన్నీ ఎంపిక చేసుకున్న బ్యాంకు ఖాతాలోనే జమకానున్నాయి. ఆధార్‌తో అనుసంధానం చేయని బ్యాంకు ఖాతాల్లో లావాదేవీలను నిలిపివేయాలని తీసుకున్న నిర్ణయం మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయని బ్యాంకు ఖాతాలు కలిగిన కూలీలకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి కూలీలకు అవగాహన కల్పించనున్నారు. ఈ శిబిరాలకు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు, ఎంపీడీవోలు, బ్యాంకు అధికారులు హాజరుకానున్నారు. ఈ ప్రక్రియ వచ్చేనెల 10వ తేదీ వరకు ముగించాలని గడువు విధించారు. జనవరి ఒకటో తేదీ నుంచి ఉపాధి పనులు చేసే కూలీల వేతనం బ్యాంకుల్లోనే జమ చేయనున్నారు. పోస్టాఫీసుల ద్వారా చెలిస్తున్న ఉపాధి కూలీ డబ్బుల చెల్లింపులను ఇక నిలిపివేయనున్నారు. మండలాల పరిధిలోని గ్రామాల్లో ఏయే రోజుల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారనేది ఇప్పటికే ప్రకటించారు. ఒక్కో గ్రామంలో నాలుగు రోజుల పాటు శిబిరం నిర్వహించనున్నారు. శిబిరానికి సంబంధిత అధికారులు హాజరై కూలీల బ్యాంకు ఖాతాలకు వారి ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయనున్నారు.



ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలంటే..

ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీ తన బ్యాంకు ఖాతాకు ఆధార్‌తో అనుసంధారం చేసుకోవాలి. గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాల్లో కూలీలకు బ్యాంకు ఖాతాకు, ఆధార్ అనుసంధానం చేసుకునే విషయమై అవగాహన కల్పిస్తారు. తమ బ్యాంకు ఖాతాకు, ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయాలని కోరుతూ కూలీల నుంచి అంగీకార పత్రం తీసుకుంటారు. బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డుతో అనుసంధానం చేసేందుకు కూలీలు తప్పనిసరిగా తమ బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు జిరాక్స్ ప్రతులను అంగీకారపత్రానికి జతపరిచి అందజేయాల్సి ఉంటుంది. కూలీ తన మొబైల్ ఫోన్ నెంబర్ నమోదు చేయాలి. అవగాహన శిబిరాలకు ఆ గ్రామాల సర్వీసు బ్యాంకులు, ఈజీఎస్ అధికారులు హాజరై బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసేందుకు అవసరమైన పత్రాలను కూలీల నుంచి స్వీకరిస్తారు. ఆధార్ సీడింగ్ చేసిన కూలీల వివరాలను వెబ్‌సైట్‌లో గ్రామ పంచాయతీల వారీగా నమోదు చేస్తారు. ఇప్పటి వరకు బ్యాంకు ఖాతా లేని కూలీలకు బ్యాంకు ఖాతా తెరిపించి ఆధార్‌తో అనుసంధానం చేయనున్నారు. ఒక కూలీకి ఒక బ్యాంకు ఖాతా కంటే ఎక్కువ ఖాతాలు ఉంటే కూలీ ఎంపిక చేసుకున్న బ్యాంకు ఖాతాను ఉపాధి హామీ ఖాతాగా గుర్తించి ఆ ఖాతాకు ఆధార్ అనుసంధానం చేస్తారు. .

అనుసంధానం చేసుకోవాలి

ఉపాధి హామీ కూలీలు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసుకోవాలి. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోని కూలీలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నాం. నగదు చెల్లింపులు కాకుండా జనవరి నెల నుంచి ఉపాధి కూలీల ఖాతాల్లోనే డబ్బులు జమ చేస్తారు.

- పీడబ్ల్యూ జాన్సన్,
జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

రెండు బస్సులు, కారు ఢీ

● ఇద్దరికి తీవ్ర, ముగ్గురికి స్వల్ప గాయాలు

● తప్పిన పెను ప్రమాదం

● సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్పీ అన్నపూర్ణ

● ఆసుపత్రిని సందర్శించిన మాజీ మంత్రి

వికారాబాద్ అర్బన్ : రెండు బస్సులు, ఒక కారు ఢీ కొన్న ప్రమాదంలో ఐదు గురికి గాయాలయ్యాయి. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని భృంగి ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన బస్సు (ఏపీ28టీబీ 5015) పాఠశాల విడిచిన తరువాత విద్యార్థులను ఇళ్ల వద్ద వదిలేందుకు బయలు దేరింది. వికారాబాద్ ఎన్నెపల్లి సమీపంలో వేగంగా వచ్చిన స్కూల్ బస్సు అదుపు తప్పి పరిగి నుంచి వస్తున్న కారును ఢీకొడుతూ అదే సమయంలో హైదరాబాద్ నుంచి వికారాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు (ఏపీ29జెడ్2597)ను ఢీ కొట్టింది. ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో రెండు బస్సులు ముందుకు దూసుకెళ్లి ముందు వెళుతున్న కారును ఢీ కొట్టాయి. ఈ ప్రమాదంలో స్కూల్ బస్సు డ్రైవర్ రాజుకు తీవ్ర గాయాలు కాగా, స్కూల్ బస్సులో ముందు వరుసలో కూర్చున్న 3వ తరగతి చదువుతున్న అనియాబేగం (గరీబ్‌నగర్ కాలనీ) బస్సు అద్దాల్లో నుంచి ముందుకు పడిపోయింది. ఈ ప్రమాదంలో అనియాబేగంకు తీవ్ర గాయాలయ్యాయి. అదే బస్సులో ముందు కూర్చున్న ఆసిఫియా (5వ తరగతి), కార్తీక్ (5వ తరగతి), సామేదా (4వ తరగతి)లకు స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సులో ఎవరికీ గాయాలు కాలేదు.

సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్పీ అన్నపూర్ణ

ప్రమాదం జరిగిన సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ అన్నపూర్ణ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి దారితీసిన వివరాల గురించి అక్కడున్న ప్రత్యక్ష సాక్షులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీఆసుపత్రికి చేరుకుని గాయపడ్డ వారి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డ విద్యార్థినులను ఎస్పీ ఓదార్చారు. మెరుగైన చికిత్స అందించేందుకు హైదరాబాద్‌కు తరలించాలంటూ ఆమె డీఎస్పీ టి.స్వామి, ధారూరు సీఐ ఉపేందర్‌లను ఆదేశించారు.

మిన్నంటిన రోదనలు

రెండు బస్సులు, కారు ఒక దానికొకటి ఢీ కొట్టడంతో ఎన్నేపల్లి ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ప్రమాద సంఘటన దృశ్యాలు, బస్సులు, కారు ధ్వంసమైన తీరు చూస్తే మాత్రం పెను ప్రమాదమే చోటు చేసుకున్నట్లుగా భయానకంగా కనిపించింది. ఎన్నేపల్లిలో బస్సులు ఢీకొన్న విషయం ఆ నోట ఈ నోట పట్టణమంతా వ్యాపించడంతో ప్రజలు పెద్ద ఎత్తున సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాద సంఘటన విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు సైతం అక్కడికి రోదిస్తూ చేరుకున్నారు. పిల్లల రోదనలతో ఆ ప్రాంతమంతా శోకసంద్రంగా మారింది. విద్యార్థులు, తల్లిదండ్రుల రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఇరువైపులా అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడం, అధిక సంఖ్యలో ప్రజలు చేరుకోవడంతో నియంత్రించడం పోలీసులకు సాధ్యం కాలేదు. సుమారు గంట సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సంఘటన స్థలం నుంచి అందరినీ పంపించేసరికి పోలీసుల తలప్రాణం తోకకు వచ్చినట్లయింది. ఎస్ఐ సురేష్ దగ్గరుండి వాహనాలను అక్కడి నుంచి తరలించారు.



ఘటన స్థలంలో గుమిగూడిన ప్రజలు, అంబులెన్స్‌లో గాయపడిన విద్యార్థులు

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన మాజీ మంత్రి

తమ పాఠశాల బస్సుకు ప్రమాదం జరిగిన సంఘటన గురించి తెలుసుకున్న భృంగి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి చంద్రశేఖర్ హుటాహుటిన సంఘటన స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. అనంతరం ఏరియా ఆసుపత్రికి చేరుకుని అక్కడ చికిత్స పొందుతున్న విద్యార్థులు, డ్రైవర్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన ఆరా తీశారు. మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని ఆయన వైద్య సిబ్బందికి సూచించారు.

మేడ్చల్‌లో దేవేందర్‌గౌడ్ చేసిన అభివృద్ధి పనులే : టీడీపీ

మేడ్చల్ : మేడ్చల్‌లో దేవేందర్‌గౌడ్ చేసిన అభివృద్ధి పనులే తప్ప మూడు సంవత్సరాలుగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమీ లేదని టీడీపీ నాయకులు అన్నారు. ఈ మేరకు వారు మంగళవారం మేడ్చల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జంగయ్యయాదవ్ పత్రికాముఖంగా ఎమ్మెల్యే అవినీతి పనులు ఎండగడుతుండటంతో ఆరోపణలు ఎదర్కోలేక అనుచరులతో విమర్శలు చేయిస్తున్నారన్నారు. దమ్ముంటే అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలన్నారు. సమావేశంలో సాయిపేట శ్రీనివాస్, చేపరాజు, లింగం, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రోడ్లపై చెత్త తొలగింపు



చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

శామీర్‌పేట రూరల్ : 'అపరిశుభ్ర గ్రామాలు' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా టాబ్లాయిడ్‌లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. శామీర్‌పేట మండలం కొల్తూర్ గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల వేసిన చెత్తను ట్రాక్టర్‌తో తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనంతరాజిరెడ్డి, బిల్ కలెక్టర్ రవీందర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



బీజేపీలో చేరుతున్న శామీర్‌పేట గ్రామ యువకులు

శామీర్‌పేట : శామీర్‌పేట గ్రామంలో జిమ్ శివతో పాటు కొందరు టీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామ చేసి బీజేవైఎం మండల అధ్యక్షుడు దేశం పవన్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాను కప్పి బీజేపీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులమై బీజేపీలో చేరినట్లు జిమ్ శివ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రజినికాంత్‌రెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాస్, జామ్ సుధాకర్, దేవేందర్, పవన్‌గౌడ్, కుర్షిబ్, పార్టీ కార్యక్తలు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో బ్రిడ్జి నిర్మాణానికి

రైల్వే ఇంజనీర్ల బృందం స్థల పరిశీలన

మేడ్చల్ : మేడ్చల్‌లో రైల్వేబ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వే ఇంజనీర్ల బృందం మంగళవారం స్థల పరిశీలన చేసింది. మేడ్చల్ పట్టణంలోని సరస్వతినగర్ వద్ద అంతర్గత బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ ఇటీవల ఎంపీ మల్లారెడ్డి నేతృత్వంలో టీఆర్‌ఎస్ పట్టణ నేతలు రైల్వేమంత్రి సురేష్ ప్రభును కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన రైల్వే అధికారులు మంగళవారం మేడ్చల్‌కు ఇంజనీర్ల బృందాన్ని పంపింది. ఈ బృందం మేడ్చల్ రైల్వేస్టేషన్ సమీపంలో బ్రిడ్జి నిర్మాణం కోసం స్థానిక టీఆర్‌ఎస్ నేతలతో కలిసి స్థల పరిశీలన చేశారు. రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సాంబయ్య నేతృత్వంలో ఏరియా సెక్షన్ ఇంజనీర్ వినోద్‌కుమార్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాస్‌రాజు వంతెన నిర్మాణం ప్రాంతంలో కొలతలు తీసుకున్నారు. కాగా రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్న మేడ్చల్ పట్టణం విస్తరణలో భాగంగా రైల్వేబ్రిడ్జిని నిర్మించాలని స్థానిక నేతలు రైల్వే అధికారులను కోరారు. బస్సులు రాకపోకలు సాగించే విధంగా బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బి.భాస్కర్‌యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, జడ్పీటీసీ శైలజ, టీఆర్‌ఎస్ నగర పంచాయతీ అధ్యక్షుడు నారెడ్డి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శేఖర్‌గౌడ్, నాయకులు విష్ణుచారి, నర్సింహారెడ్డి, నవీన్, బాలప్ప పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న రైల్వే ఇంజనీర్‌ల బృందం

మేడ్చల్‌లో ఎమ్మార్పీఎస్ రిలే నిరాహారదీక్ష



రిలేనిరాహారదీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మేడ్చల్ రూరల్ : ఎస్సీ వర్గీకరణకు తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రుల అఖిలపక్ష బృందాలను ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. మేడ్చల్ పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించటానికి కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. మూడు సంవత్సరాలుగా సమస్యను పరిష్కరించకపోవడం విచారకరమన్నారు. వర్గీకరణ అమలు పట్ల తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ చిత్తశుద్దిని నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకుడు ఆనంద్‌రావు, మండల అధ్యక్షులు పరుశరాములు, శివకుమార్, సునీల్, రాజారామ్, సుధాకర్, భానుచందర్, యాదగిరి, నర్సింహ, స్వామి, నర్సింగ్‌రావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మహిళా సంఘాల సభ్యులు

శామీర్‌పేట రూరల్ : శామీర్‌పేట మండలం కొల్తూర్ గ్రామంలోని చెరువు శిఖం భాగంలో డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు క్లస్టర్ కో ఆర్డినేటర్ వసంత ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలను నాటారు. సాయిరామ్, వెంకటేశ్వర, ప్రసన్న, చందమామ, రాఘవేంద్ర, వీరభద్ర, దత్తాద్రి సంఘాలకు చెందిన లాస్య, కవిత, మల్లైఖ, మణెమ్మ, యాదమ్మ సంఘం సభ్యులు దాదాపుగా 100 మొక్కలను నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనంతరాజిరెడ్డి, బిల్ కలెక్టర్ రవీందర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటడానికి గుంతలు సిద్ధం చేస్తున్న మహిళలు



'స్వరాజ్యం నా జన్మహక్కు' అని బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా నినదించిన లోకమాన్య బాలగంగాధర్‌తిలక్ 97వ వర్ధంతిని మంగళవారం మేడ్చల్ పట్టణంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి రాగజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీధర్‌రెడ్డి, సంజన, మోహన్‌రావు, మల్లీశ్వరీ, రమేష్‌గౌడ్, అఖిల్‌రెడ్డి, విజయ, గీత తదితరులు పాల్గొన్నారు.

- మేడ్చల్ రూరల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు భాస్కర్

మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరుతూ

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థి చైతన్య యాత్ర

మేడ్చల్ రూరల్ : మేడ్చల్ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరుతూ మూడురోజులపాటు నిర్వహించతలపెట్టిన విద్యార్థి చైతన్య యాత్రను మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీఎం, ఆక్స్‌ఫర్డ్, ఎస్‌ఎస్‌జీ, సాధన, పీవీ స్కూల్, ఎస్‌ఎన్‌ఆర్ కాలేజీ, ప్రభుత్వ బాలుర, బాలికల, లక్ష్మమ్మ, కృష్ణవేణి టాలెంట్, న్యూలిటిల్ లిల్లీ తదితర పాఠశాలల్లో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వెళ్లి విద్యార్థులను చైతన్యపరిచారు. మేడ్చల్‌లో డిగ్రీ కాలేజీ ఆవశ్యకత గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేకపోవడంతో ప్రతి ఏటా చాలా మంది విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే డిగ్రీ కాలేజీ కోసం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేకు ఓటమి తప్పదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.నరేష్, అధ్యక్షుడు ఆర్.సంతోష్, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, మండల కార్యదర్శి నర్సింహ, ప్రశాంత్, విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర నాయకులు బంటు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఎస్ శామీర్‌పేట గ్రామ అధ్యక్షుడిగా డప్పు సాయిబాబా



సాయిబాబాను అభినందిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

శామీర్‌పేట : టీఆర్‌ఎస్ పార్టీ శామీర్‌పేట గ్రామ అధ్యక్షుడిగా డప్పు సాయిబాబా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం శామీర్‌పేట గ్రామంలో టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విష్ణు, సర్పంచ్ కిషోర్ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి గ్రామ నూతన కమిటీని ఎన్నిక చేశారు. టీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడిగా ఉన్న శ్రీధర్ అనివార్య కారణాల వల్ల ఇటీవల పదవికి రాజీనామా చేశాడు. దీంతో ఆ స్థానంలో గ్రామ శాఖ నూతన అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైంది. దీంతో టీఆర్‌ఎస్ శామీర్‌పేట గ్రామ అధ్యక్షుడిగా డప్పు సాయిబాబాను పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు కుమ్మరి శ్రీరాములు, చంద్‌పాషా, ఎండీ అఫ్జల్‌ఖాన్, వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, మైసయ్య, మురళీగౌడ్, పవన్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌సరఫరా నిలిపివేత

మేడ్చల్ : మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి, బండమాదారం, నూతన్‌కల్ సబ్ స్టేషన్ల పరిధిలో నేడు(బుధవారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ జాన్‌పీటర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ఎలక్ట్రిక్ పనులు నిర్వహిస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామనీ, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఇక రైతులకు
పక్కాగా రికార్డులు

● పోస్టులోనే నేరుగా రైతింటికి పాసుపుస్తకాలు
● సుతారిగూడలో భూ క్రమబద్ధీకరణ పనులను ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్



వ్యవసాయ భూములను పరిశీలిస్తున్న కలెక్టర్



రైతుల పాస్‌పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్

మేడ్చల్ : మేడ్చల్ జిల్లాలో ఇక రైతులు పట్టాదారు పాసుపుస్తకాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన అవసరం లేదని పోస్టులోనే నేరు గా రైతింటికి పాసుపుస్తకాలు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని జిల్లా కలెక్టర్ ఎంవి.రెడ్డి తెలిపారు. మేడ్చల్ జిల్లా కండ్లకోయ గ్రామానికి అనుబంధ గ్రామమైన సుతారిగూడలో రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న భూ క్రమబద్దీకరణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మొదట నేరుగా వ్యవసాయ భూముల వద్దకు వెళ్లి నేరుగా రైతులతో మాట్లాడారు. ఈ విధానంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా..? ఏవైనా అనుమానాలున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుతారిగూడలోని వీఆర్వో కార్యాలయం వద్ద పలువు రు రైతులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల ఇబ్బందులను తెలుసుకుని రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల వారిగా భూ రికార్డులను సరిచేయాలని ఆదేశించినట్లు వివరించారు. పలుచోట్ల వంశపారంపర్యంగా వస్తున్న భూములు రికార్డుల్లో తాతల, తండ్రుల పేరిట ఉంటున్నాయని అలాంటి రికార్డులన్ని పక్కాగా సరి చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో రెవెన్యూ అధికారులు ఇం టింటికి తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నారన్నారు. సర్వే నెంబర్‌ల వారిగా రికార్డులు సరిచేస్తున్నారన్నారు. నెల రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని కలెక్టర్ తెలిపారు. ఎవరూ కార్యాలయాల చుట్టూ తిరుగవద్దన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానిక తహసీల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డి భూ క్రమబద్దీకరణపై పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. మొదట మాన్యువల్‌గా తయారు చేసి తర్వాత వెబ్‌లాండర్‌లో రికార్డులు అప్‌లోడు చేస్తున్నట్లు తహసీల్దార్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భం గా గ్రామంలో పర్యటించిన కలెక్టర్ పలువురు గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రేషన్ బియ్యం అందుతున్నాయా గ్రామంలో ఏవైనా సమస్యలున్నాయా అని గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు మొక్కలు అందజేయాలని స్థానిక సర్పంచ్ కందాడి నరేందర్‌రెడ్డికి కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హనుమంతరెడ్డి, ఎంపీడీవో దేవసహాయం, వీఆర్వోలు వెంకట్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, కార్యదర్శి చంద్రప్రకాశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, మాజీ కార్యదర్శులకు
షోకాజ్ నోటీసులు

కీసర రూరల్ : ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ గ్రామ సర్పంచ్ ఎన్.వరలక్ష్మికి జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. లోకాయుక్త ఉత్తర్వుల మేరకు చౌదరిగూడ గ్రామ పరిధిలోని వెంకటాద్రి టౌన్‌షిప్ లేఅవుట్‌లో గ్రామపంచాయతీకి చెందాల్సిన 10శాతం భూమిని సర్పంచ్ అన్యాక్రాంతం చేయడంపై లోకాయుక్త ఆదేశాల మేరకు ఆమెను పదవి నుంచి ఎందుకు సస్పెండ్ చేయకూడదో వివరణ ఇవ్వాలని కోరుతూ సురేష్‌మోహన్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అలాగే ఘట్‌కేసర్ మండలం పోచారం గ్రామంలో గతంలో పనిచేసిన కార్యదర్శి సునీత విద్యుత్ పరికరాలు కొనుగోలులో నిధులు దుర్వినియోగం చేసినందుకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ కార్యదర్శి సురేష్‌మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

'బతుకమ్మ చీరల'కు శ్రీకారం

- పేద మహిళలకు, చేనేతకు సర్కారు చేయూత
- జిల్లాలో దాదాపు 5.09లక్షలమంది లబ్ధిదారులు
- గ్రామాల్లో, పట్టణాల్లో త్వరలో ఎంపిక కమిటీలు
- సభ్యులుగా పంచాయతీ కార్యదర్శులు/ మున్సిపల్ అధికారులు, వీఆర్వో, ఎస్‌హెచ్‌జీలు
- సెప్టెంబర్ 13నుంచి చీరల పంపిణీ

(ఆంధ్రజ్యోతి, మేడ్చల్‌జిల్లా ప్రతినిధి)

మహిళల కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లయితే ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తుంది. ఈ పథకం కింద రూ.51వేల ఆర్థిక సహాయం అంది స్తుంది. గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల జిల్లా ప్రభుత్వం దృష్టి సారించింది. అమ్మఒడి కార్య క్రమానికి శ్రీకారం చుట్టింది. మాతా, శిశు మరణాలు నివారించేందుకు చర్యలు తీసుకుంటుంది. అమ్మ ఒడి పథకం ప్రభుత్వ ఆస్పత్రుల్లో మగ పిల్లాడు జన్మిస్తే రూ.12వేలు, ఆడపిల్ల జన్మి స్తే రూ.13వేలతో పాటు, కేసీఆర్ కిట్‌లను అందజేయడంతో పాటు తల్లి, బిడ్డ ఆరోగ్య సంరక్షణ కోసం 16రకాల వస్తువులను అందిస్తున్నారు. సమాజంంలో వివక్షక గురవుతున్న మహిళలకు ఆర్థికంగా చేయూతనివ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జీవనభృతి కింద రూ.వేయి అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఒంటరి మహిళలకు జీవనభృతికి భరోసా ఇచ్చింది. ఆసరాపథకం కింద వీరికి పింఛన్లు మంజూరు చేసింది. మేడ్చల్-మల్కాజ్‌గిరిజిల్లాలో దాదాపు 8వేల మంది ఒంటరి మహిళలకు నెలకు రూ. వేయి చొప్పున పింఛన్లు అందుతున్నాయి. మహిళల కోసం ప్రభుత్వం మరో నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. బతుకమ్మ చీరల పంపిణీ పథకం ద్వారా చేనేత కార్మికుల చేయూతనిస్తూ, పేదల మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ చీరలను అందించనున్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ రోజున, ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా పేదలకు ఉచితంగా ప్రభుత్వం దుస్తులను పంపిణీ చేస్తుంది. తెలంగాణాలో హిందువులు దసరా పండుగను ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా పేద మహిళలందరికీ బతుకమ్మ చీరల పంపిణీ చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో మొత్తం 14మండలాలు ఉన్నాయి. ఆరు మండలాలు గ్రామీణ మండలాలు కాగా, 8మండలాలు జీహెచ్ ఎంసీ పరిధిలో ఉన్నాయి. అయితే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై ప్రభుత్వం నుంచి త్వరలోనే మార్గదర్శకాలు జారీ కానున్నాయి. అయితే ఆహార భద్రతకార్డులు గల వారందరూ కూగా అర్హులుగా గుర్తించనున్నారు. జిల్లాలో దాదాపు 5.09లక్షల మంది లబ్ధిదారులు ఉన్నట్టుగా జిల్లా యంత్రాంగం ప్రాథమికంగా అంచనావ వేసింది. జిల్లాలో దాదాపు 7వేల మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ)ఉన్నాయి. ఈ మేరకు గ్రామాల్లో, పట్టణాల్లో త్వరలోనే ఎంపిక కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీల్లో గ్రామీణప్రాంతాల్లో గామపంచాయతీకార్యదర్శి, వీఆర్వో, స్వయం సహాయ సంఘాల సభ్యులు ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు. పట్టణాల్లో మున్సిపల్ శాఖ అధికారి, అర్బన్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ప్రభుత్వం 100 రకాల డిజైన్లలో చీరలను తయారు చేయనున్నారు. ఒక్కో బిండల్‌లో 150 చీరల వరకు ఉంటాయి. ఒక్కో చీరకు దాదాపు రూ.200 నుంచి రూ.500 వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సమయంలో చీరలను పంపిణీ చేయనుండటంతో తెలంగాణలోని సిరిసిల్ల నుంచి గుజరాత్ లోని సూరత్‌నుంచి చీరలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు 15వ తేదీ నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసేందుకు డీఆర్డీవో అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. సెప్టెంబర్13 నుంచి చీరల పంపిణీకి చర్యలు తీసుకోనున్నారు. దసరా ముందు నిర్వహించే బతుకమ్మ పండుగలోగా ఈ చీరలు లబ్ధిదారులకు అందజేయనున్నారు. చీరల పంపిణీలో మహిళా సంఘాలు, రేషన్‌షాపుల డీలర్లు ప్రధాన పాత్ర పోషించనున్నారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ పథకాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాయంత్రాంగం చర్యలు తీసుకుంటుంది.

చీరల నిల్వ కోసం గోదాముల ఎంపిక

ప్రభుత్వం పేదల మహిళల కోసం పంపిణీ చేస్తున్న చీరలను నిల్వ చేసుకునేందుకు వీలుగా గోదాములను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం జిల్లాయంత్రాంగానికి సూచించింది. ఈ మేరకు కలెక్టరేట్ సమీపంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీల గల గోదామును, డీఆర్డీఏకు సంబంధించిన గోదాములను పరిశీలించనున్నారు. జిల్లా వ్యాప్తంగా చీరల పంపిణీకి వీలుగా ఉండే గోదాములను ఎంపిక చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



దసరాకు బతుకమ్మ చీరల పంపిణీ

● 18 సంవత్సరాల మహిళలందరికీ..
● చేనేతను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో చీరల పంపిణీకి శ్రీకారం
● 7న చేనేత వస్త్రాల వినియోగంపై ర్యాలీలు
● వీడియో కాన్ఫరెన్స్‌లో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న జయేష్‌రంజన్

కీసర రూరల్ : బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం సచివాలయం నుంచి బతుకమ్మ చీరల పంపిణీ, చేనేత దినోత్సవంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగా కానుకగా రాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. చేనేత దుస్తులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేసేందుకు చీరలను తయారు చేయించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని సిరిసిల్ల, గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నుంచి చీరలను సరఫరా చేస్తామని తెలిపారు. ప్రభుత్వం వంద రకాల నూతన డిజైన్లల్లో చీరలను తయారు చేయాడానికి ఆదేశించారని వెల్లడించారు. ప్రతి జిల్లా కేంద్రంలో చీరలను భద్రపరిచేందుకు గోదాములను సిద్ధం చేసుకోవాలని, చీరలను నేరుగా గోదాములకు సరఫరా చేస్తామని, అక్కడి నుంచే గ్రామాలకు చీరలను తరలించాలని సూచించారు. ప్రతి జిల్లాలో 18సంవత్సారాలు నిండిన మహిళలందరికీ చీరలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, కమ్యూనిటీహాళ్లలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. చీరల పంపిణీకి కార్యదర్శి, వీఆర్వో, మహిళా సంఘాలు, గ్రామ సంఘాలను సమన్వయం చేసుకుని గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాలకు పంపిణీ చేసేందుకు వీలుగా చీరలను జిల్లా కేంద్రాలకు చేరవేయనున్నట్లు తెలిపారు. వీటిని భద్రపరచడానికి అన్ని సౌకర్యాలున్న గోదాములను వారం రోజుల్లో గుర్తించి సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పంపిణీలో రేషన్‌డీలర్లను భాగస్వాములను చేయాలన్నారు. దసరా పండుగ నవరాత్రి వేడుకల్లో ఒక్కోరోజు కొన్ని ప్రాంతాలను ఎంపి చేసుకుని చీరల పంపిణీని చేపట్టాలని తెలిపారు. ముఖ్యమంత్రి, ఐటీశాఖా మంత్రి కేటీఆర్‌లు చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. ప్రతి సోమవారం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు చేనేత వస్త్రాలు ధరించాలని వారు పిలుపునిచ్చారని తెలిపారు. ఆగస్టు 7న చేనేత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం చేనేత వస్త్రాల వినియోగంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు ర్యాలీలు చేపట్టనుందని, జిల్లా స్థాయిలోనూ కలెక్టర్లు, ఉన్నతాధికారులు ర్యాలీలు నిర్వహించి చేనేత దుస్తులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ ర్యాలీల్లో జిల్లాలోని ప్రముఖులతో పాటు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల ఉద్యోగులు, పాఠశాలలు, కళా శాలల విద్యార్థులు, మహిళా సంఘాలను భాగస్వాములను చేసి చేనేత దుస్తులపై అవగాహన కల్పించాలని తెలిపారు.

జిల్లా స్థాయిలో చేనేత స్టాళ్లను ఏర్పాటు చేసి పాఠశాలల, కళాశాలల విద్యార్థులు చేనేత దుస్తులను ధరించే విధంగా ప్రోత్సహించాల ని సూచించారు. ఈసందర్భంగా కలెక్టర్ ఎంవీ.రెడ్డి మాట్లాడు తూ ఇప్పుడున్న రేషన్‌కార్డులతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన మహి ళలకూ చీరలు పంపిణీ చేసేలా చూడాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ కౌటిల్య, డీఎస్‌వో నాగేశ్వర్ రావు, డీపీవో సురేష్ మోహన్, డిఈవో ఉషారాణి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ విచారణ అక్కర్లేదు..

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ భూములపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నందున సీబీఐ విచారణ అక్కర్లేదని రెవెన్యూశాఖ పేర్కొంది. ఈ భూముల కుంభకోణంలో సీబీఐ విచారణ జరిపించాలని దాఖలైన పిల్ విచారణలో భాగంగా రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా సోమవారం అఫిడవిట్ దాఖలు చేశారు. 2016 నవంబరు 19న శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లో సర్వేనెం.101, 20, 28, 100లలో 693 ఎకరాల ప్రభుత్వ భూముల కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసుపై సీబీఐ విచారణ జరిపించాలని పిల్ దాఖలుకాగా... హైకోర్టు నోటీసులతో రెవెన్యూశాఖ అఫిడవిట్ సమర్పించింది. అయితే ఈ భూముల వివాదం సుప్రీంకోర్టులో విచారణలో ఉందని...రెండు ప్రైవేట్ పార్టీల మధ్య వివాదం నడుస్తోందని... ఆ కేసులో తాము ప్రతివాదులుగా లేమని గుర్తు చేశారు. భూముల రిజిస్ట్రేషన్‌ను రద్దుచేశామని నివేదించారు. దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం కొట్టివేయాలని కోరారు. మరోవైపు ఈ భూముల కేసు సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా... ఆ భూమి మాదంటే మాదని రెండు ప్రైవేట్ పార్టీలు క్లెయిమ్ చేస్తుండగా ఈ కేసులో ప్రభుత్వం ప్రతివాదిగా చేరకపోవడం అనుమానాలు కలిగిస్తోంది.

ఆదర్శ రైతుల సంఘం మాజీ అధ్యక్షుడి మృతి



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌టౌన్: ఆదర్శ రైతుల సంఘం ఫరూఖ్‌నగర్ మండల శాఖ మాజీ అధ్యక్షుడు, ఆంధ్రజ్యోతి పీసీ ఇన్‌చార్జి లట్టుపల్లి మోహన్‌రెడ్డి సోదరుడు లట్టుపల్లి శ్రీనివాస్‌రెడ్డి(53) ఆకస్మికంగా మృతి చెందారు. శనివారం రాత్రి స్వగ్రామమైన మధరాపురంలోని కింద పడిన శ్రీనివాస్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలైయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి అతన్ని చికిత్స కోసం తరలించారు. అయితే ఆపరేషన్ అనంతరం చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. శ్రీనివాస్‌రెడ్డి గతంలో ఆదర్శ రైతుల సంఘం మండల శాఖ అధ్యక్షునిగా పనిచేసి ఎంతో మందికి వ్యవసాయంలో మెలకువలు నేర్పించారు. మండలంలోని పలువురు రైతులకు ఆదర్శంగా నిలిచారు. శ్రీనివాస్‌రెడ్డి అంత్యక్రియలు మంగళవారం మధురాపురం గ్రామంలో జరిగాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మాజీ మంత్రి డాక్టర్ పి. శంకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సి. ప్రతాప్‌రెడ్డి, బక్కని నర్సింలు, షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి విశ్వం, బీజేపీ తెలంగాణా విమోచన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. శ్రీవర్ధన్‌రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త పాతూరి వెంకట్రావులతో పాటు పలువురు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

‘25వేల నవీన క్షౌర శాలల ఏర్పాటు’



మాట్లాడుతున్న పాల్వాయి శ్రీనివాస్

ఆమనగల్లు : రాష్ట్రంలో 25వేల నవీన క్షౌరశాలల ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందని నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాల్వాయి శ్రీనివాస్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని వెంకటనర్సింహ్మ గార్డెన్‌లో మంగళవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయీబ్రాహ్మణ సేవా సంఘం ప్రచార కార్యదర్శి కానుగుల దశరథం అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సిద్దులు ,ఉపాధ్యాక్షులు మల్లారి రమేశ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు . అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసిఆర్ నిర్ణయం మేరకు నవీన క్షౌర శాలల ఏర్పాటుకు సంబంధించి ఈనెల 8న మంత్రులు ఈటెల రాజేందర్, జోగు రామన్నల ఆద్యక్షతన సమావేశం నిర్వహించి విదివిధానాలను ఖరారు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి యాదయ్య, మండల అధ్యక్షుడు పెరికేటి యాదయ్య, ఉపాధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి దేవర కొండ రమేశ్, నాయకులు గణేశ్, తానయ్య, పెద్దయ్య , రమేశ్, యాదగిరి, మూర్తి , రాంచంద్రయ్య, నర్సింహ్మ , బాలు, సైదులు , యాదయ్య, బిక్షపతి, పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద దాడికి పాల్పడిన నిందితుల అరెస్ట్

- నిందితులకు 14 రోజుల రిమాండ్
- అధికార పార్టీ నేత కుమారుడు, స్నేహితుల వీరంగం
- రూ.30 టోల్ ఫీజు చెల్లింపుపై ఘర్షణ
- కారు ఆపినందుకు సిబ్బందిపై దాడి
- సూపర్‌వైజర్‌ని వెంటాడి కత్తితో పొడిచిన వైనం
- నిందితులను కేసు నుంచి తప్పించే యత్నం

ఆమనగల్లు / కడ్తాల్ : అధికార పార్టీ నేత కుమారుడు, అతని స్నేహితులు తప్పతాగి కడ్తాల్ టోల్‌ప్లాజా వద్ద వీరంగం సృష్టించిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్ట్‌చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కల్వకుర్తి మున్సిఫ్‌కోర్టు ఆరుగురికి 14రోజుల పాటు రిమాండ్ విధించింది. సోమవారం రాత్రి అధికార పార్టీ నాయకుడి కుమారుడు కడ్తాల్ వద్ద టోల్ ఫీజు కట్టకుండా వెళుతున్న వాహనాన్ని ఆపినందుకు స్నేహితులతో కలిసి సిబ్బందిపై కత్తి తీసి దాడి చేసిన విషయం విదితమే. ఈ దాడిలో సూపర్ వైజర్ గాయాలతో బయటపడ్డాడు. ఆ తర్వాత ఆ యువకులు కారులో పారిపోతుండగా టోల్‌సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కడ్తాల్ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తమ సిబ్బందితో మాటు వేసి వారిని పట్టుకున్నారు. ఇదిలా ఉండగా టోల్‌ప్లాజా సూపర్ వైజర్ మహేశ్‌ది కడ్తాల స్వస్థలం కావడంతో దాడి వార్త తెలియగానే స్థానికులు ,కుటుంబీకులు , స్నేహితులు, వివిధ పార్టీల నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. వాస్తవానికి ఈ ఘర్షణ అంతా రూ. 30ల టోల్ ఫీజు చెల్లించే విషయంలో జరగడం గమనార్హం.



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి

కేసు తప్పించేయత్నం

ఈ సంఘటనపైస్టేషన్ వద్ద అర్ధరాత్రి వరకు హైడ్రామా నెలకొంది. ఎల్‌బిఎనగర్ టీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి ముద్దగోని రామ్మోహన్ గౌడ్ కుమారుడు ఉండటంతో కేసు నుంచి తప్పించేందుకు కొందరు నాయకులు యత్నించారు. మహేశ్‌ను ఫిర్యాదు తిరిగి తీసుకోవడానికి పెద్ద ఎత్తున బేరసారాలు కూడ సాగినట్లు సమాచారం. కేసు నమోదులో కూడా ఆలస్యం చేశారు. రామ్మోహన్ గౌడ్ కూడ అర్ధరాత్రి కడ్తాలలోని మహేశ్ఇంటికి చేరుకొని జరిగింది పొరపాటే అని అతనికి నచ్చజెప్పె ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయినట్లు తెలిసింది. అయితే ఈ విషయం తెలిసిన పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోవడంతో వెంటనే కేసు నమోదు చేశారు.

దాడికి పాల్పడిన ఆరుగురి అరెస్ట్...

టోల్‌ప్లాజా సూపర్‌వైజర్ మహేశ్‌పై దాడికిసంబంధించి ఆరుమంది యువకులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. సోమవారం జరిగిన దాడికి సంబంధించి బొప్పిడి అరుణ్ కుమార్ రెడ్డి, కేత నిశిత్ , తాళ్లపల్లి సాయితేజరెడ్డి, ముద్దగోని మనీష్ గౌడ్, సామ సాయి కుమార్, మారుపాకుల అనిరుధ్ గౌడ్‌ల పై మహేశ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదే రాత్రి వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మంగళవారం కల్వకుర్తి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌హెచ్‌ఓ శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులపై ఐపీఎస్ 148, 307,506ఆర్/ డబ్ల్యూ కింద కేసు నమోదు చేశారు.



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

సూపర్‌వైజర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ఈ ఘటనలో గాయపడిన టోల్‌ప్లాజా సూపర్‌వైజర్ గాయపడంతో విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి మంగళవారం కడ్తాల్‌లోని ఇంటికి వెళ్లి మహేశ్‌ను పరామర్శించారు. దాడికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స కోసం మహేశ్‌ను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి తెలిపారు.

వంట.. మంట

- వంట గ్యాస్‌కు మంగళం..
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పెనుభారం
- ప్రతి నెలా రూ.4కు పెంచుతూ చివరకు స్వస్తి
- వంట గ్యాస్ మంటగా మారుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న వినియోగదారులు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : వంట గ్యాస్ సిలిలండర్‌పై సబ్సీడీని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్దం చేసింది. ఆ భారాన్ని ప్రజలపై రుద్దేందుకు నిర్ణయించింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం సబ్సిడీని ఎత్తివేసేందుకు సిలిండర్‌పై నెలా రూ.4 పెంచాలని నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ (ఎల్‌పీజీ) సిలిండర్‌పై రాయితీని ఎత్తివేసేందుకు నిర్ణయం తీసుకోవటంపై పేద మధ్యతరగతిపై మోయలేని భారం పడనుంది. ఒకేసారి కాకుండా ప్రతి నెలా ధర పెంచుతూ.. కొన్నాళ్లలో రాయితీకి మంగళం పలికేందుకు చూస్తుంది. వంట గ్యాస్ సబ్సిడీ ఎత్తివసేందుకు కేంద్ర తీసుకున్న నిర్ణయంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గ్యాస్‌పై రాయితీ ఎత్తివేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 41 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీఎల్ సంస్థలు ప్రతి నెలా వినియోగ దారులకు గ్యాస్‌ను సరఫరా చేస్తుంది. జిల్లాలో మొత్తం 303654 గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో సాధారణ కనెక్షన్లు 717245 ఉన్నాయి. అదే విధంగా దీపం కనెక్షన్లు 113312 కనెక్షన్లు ఉండగా సీఎస్ఆర్ కనెక్షన్లు 38815 ఉన్నాయి. ప్రస్తుతం రాయితీ వంట గ్యాస్ సిలిండర్ రూ.477.46 గా ఉండగా గ్యాస్ ఏజెన్సీలు రూ.630 వినియోగదారులకు అందజేస్తున్నారు. రూ. 153 సబ్సిడీ డబ్బులను వినియోగదారుల ఖాతాలో జమజేస్తుంది. గ్యాస్ సిలిండర్‌ను ఇంటి వద్దకు తీసుకు వచ్చి సరఫరా చేస్తున్నందుకు గాను అదనంగా రూ. 30 తీసుకుంటున్నారు. ఇప్పటికే భారంగా భావిస్తున్న సామాన్యులకు సబ్సిడీ ఎత్తివేత కారణంగా మరింత భారంగా మారనుంది. జిల్లాలో 303654 గ్యాస్ సిలింజర్లకు గాను నెలకు రూ. 4 పెంచితే వినియోగదారులపై రూ.12 లక్షల భారం పడుతుంది. అలాగే ఏడాది పాటు పెంచిన ధరను లెక్కిస్తే.. రూ. 1.51 కోట్లు భారం పడుతుంది. పెరుగుతున్న నిత్యావసరాలకు ఉక్కిరిబిక్కిరవుతున్న సామాన్యులకు వంట గ్యాస్ మంటగా మారింది. సబ్సిడీ ఎత్తివేస్తుండటంతో మళ్లీ కట్టెల పొయ్యే బెటరనుకుంటున్నారు. వంట చెరుకుకు డిమాండ్ పెరగనుంది.

కట్టెల పొయ్యి బెటర్..



రాయితీ ఎత్తివేస్తే కట్టెల పొయ్యి బెటర్. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలి. పేదలకు అందించే వంటగ్యాస్ సిలిండర్‌పై రాయితీ కల్పించాలి. రాయితీ విషయంలో ప్రభుత్వం మరోసారి ఆలోచించాలి. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ పై రాయితీ ఎత్తి వేయడం చాలా దారుణాం. ఇప్పటికే పేరిగిన ధరలతో పేద మద్య తరగతి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

పి.హేమలత, గున్‌గల్

ప్రజలపై భారం మోపొద్దు..



కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రాయితీని ఎత్తి వేస్తున్నమని ప్రకటించే ముందు ప్రజల స్థితిగతులను తెలుసుకోవాలి. రెక్కాడితే కాని డొక్కాడని గ్రామీణ ప్రజలపై కేంద్రం గ్యాస్ రాయితీ ఎత్తివేసే దిశగా ప్రకటించడం మంచి పద్దతి కాదు. రాయితీ ఎత్తివేత నిర్ణయం కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం సరైనది కాదు. మరోసారి పునరాలోచించాలి. ప్రతి ఒక్కరికి గ్యాస్ తప్పనిసరి. వంట గ్యాస్ లేకుంటే కష్టం. ప్రభుత్వం ఇచ్చే గ్యాస్ రాయితీని ఎత్తివేయాలనుకోవడం సరైంది కాదు. ఈ విషయంలో మరోసారి ఆలోచించాలి.

హన్మంత్, చేవెళ్ల

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం : విద్యుత్ ఏఈ

కీసర: నేడు కీసర మండలం దమ్మాయిగూడ గ్రామంలోని పలు కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నాగారం విద్యుత్ ఏఈ శ్రీకాంత్ మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. 11 కేవీ విద్యుత్ మరమ్మతుల కారణంగా గ్రామంలోని నర్సయ్య, సాయిప్రియ, రఘురామ్, రాజిరెడ్డి, బ్యాంక్, నారాయణరావు కాలనీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కరెంట్ కష్టాలతో సతమతం

● లోఓల్టేజి సమస్యతో జనం ఇబ్బందులు ● చిన్నపాటి గాలికే విద్యుత్‌కు అంతరాయం
● మరమ్మతులు చేయాలని గ్రామస్థుల ఫిర్యాదు ● ఆరు నెలలైనా పట్టించుకోని అధికారులు


ఉత్తర బస్తీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఘట్‌కేసర్ రూరల్: నాణ్యమైన విద్యుత్ అందించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నా కరెంట్ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. చిన్న చిన్న సమస్యలను పరిష్కారం కోసం అధికారుల చుట్టు తిరుగాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. మండలంలోని యంనంపేట్ గ్రామంలో లోఓల్టేజి సమస్యతో ఆరు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వంతో లోఓల్టేజి సమస్య రోజు రోజుకు తీవ్రమవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా సరఫరా జరుగుతోంది. బస్టాండ్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై 25 శాతం కనెక్షన్లు, ఉత్తర బస్తీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై 75 శాతం కనెక్షన్లు ఉన్నాయి. ఉత్తర బస్తీలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మీద ఎక్కువ లోడు పడటంతో లోఓల్టేజీ సమస్య ఉత్పన్నమవుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో ఇళ్లలో విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయన్నాయంటూ గ్రామస్థులు వాపోతున్నారు. వారంలో రెండు మూడుసార్లు కరెంటు సరఫరా నిలిచిపోయి రాత్రి వేళల్లో పడుకోలేని పరిస్థితి నెలకొన్నదని వారు ఆరోపిస్తున్నారు. గతంలో ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు అంటున్నారు. ట్రాన్స్‌ఫార్మార్‌కు లోడెక్కువై విద్యుత్‌కు అంతరాయం కలిగిన మరుసటి రోజు గ్రామంలో నీటి సరఫరా ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు సమానంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తే లోఓల్టేజీ సమస్య తీరుతుందని, ఇప్పటికైనా గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు



మండల సర్వసభ్య సమావేశంలో, గ్రామసభలో విద్యుత్ సమస్యపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. వారంలో రెండు మూడు సార్లు లోఓల్టేజి వచ్చి, రాత్రి సమయాలలో నిద్రలేకుండా గడుపుతున్నాం. కార్యాలయాల చుట్టు తిరుగాల్సి వస్తోంది. లోఓల్టేజి వచ్చిన మరుసటి రోజు బోర్లకు కరెంట్ లేక నీటి సమస్య వస్తోంది.

-శ్రీశైలం, ఎంపీటీసీ యంనంపేట్

చిన్నపాటి గాలికే ట్రిప్ అవుతోంది



చిన్న పాటి గాలి దుమారినికే ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ అవుతోంది. మా గ్రామానికి విద్యుత్ ఏ ఫీడర్ నుంచి వస్తుందో, ఎవరిని అడగాలో అర్థకాని పరిస్థితి నెలకొన్నది. దాదాపు ఆరు నెలలుగా విద్యుత్ లోఓల్టేజి సమస్యతో ఇబ్బందులు పడుతున్నం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలి.

-పాండు రాజు, యంనంపేట్ గ్రామస్థుడు

ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ తరగతులు


సమావేశంలో పాల్గొన్న ఆర్ఎంపీ, పీఎంపీలు

కీసర: గ్రామీణ వైద్యులైన ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో కమ్యూనిటీ పారామెడికల్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. వెంకన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రం కీసరలో జిల్లా స్థాయి ఆర్ఎంపీ, పీఎంపీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకన్న మాట్లాడుతూ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డిలు సంబంధిత అధికారులకు ఉతర్వులు జారీ చేశారని ఆయన తెలియజేశారు. వైద్యులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా 4సీ8 జీవోను జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన ఆర్ఎంపీ, పీఎంపీ కార్యవర్గం సభ్యులను నియమించారు. అధ్యక్షుడిగా సుధాకర్, గౌరవ అధ్యక్షుడిగా సుభాష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చక్రపాణీ, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్,కోశాధికారిగా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలి : సర్పంచ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని మైసమ్మగుట్ట కాలని, గుంటుగూడెంలోని ప్రజలకు జిఓ 58, 59 ప్రకారం పట్టాలు పంపిణీ చేయాలని ఘట్‌కేసర్ సర్పంచ్ అబ్బసాని యాదగిరి మంగళవారం డిప్యూటీ తహసీల్దారును కలిసి వినతి పత్రం అందజేశారు. గుంటుగూడెం, మైసమ్మగుట్ట కాలని లో నివసిస్తున్న ప్రజలకు జీవో నెంబర్ 58, 59లలో పట్టాలు పంపిణీ చేశారని మిగిలిపోయిన వారికి కూడా పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బేతాల నర్సింగ్‌రావు, పంచాయతీ సభ్యుడు బురుగు చంద్రశేఖర్‌గుప్త పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనకు
అందరూ కృషి చేయాలి : ఆరోగ్య భోధకుడు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రవికుమార్

ఘట్‌కేసర్: ఈ నెల 10న జరిగే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆరోగ్య భోదకుడు రవికుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంతో పాటు 17వ తేదీ నుంచి మిజిల్స్, రుబెల్లా టీకాలు కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేపట్టి విద్యార్థులందరికి ఈ టీకాలు అందేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నులిపురుగులు పిల్లల్లో ఉంటే పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తి ఇబ్బంది పడుతుంటారని వాటి నిర్మూలనకు కృషి చేయాలన్నారు.మిజిల్స్, రుబెల్లా టీకాలు 9 నెలల నుంచి 15 సంవత్సరాలు లోపు ఉన్నవారికి వేయాలని కోరారు. వీటిపై విస్తృత ప్రచారం చేసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సతీస్‌చంద్ర,ఎంఈఓ నర్సింహ్మాహారెడ్డి, భూవనేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంజార బోనాలు


జంగయ్య యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఘట్‌కేసర్: మండలంలోని అన్నోజిగూడలో మంగళవారం బంజారల బోనాల పండగ ఘనంగా జరిగింది. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తోటకూర జంగయ్యాయాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను స్థానికులు ఘనంగా సన్మానించారు. అలాగే టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలలో రూప్‌సింగ్ నాయక్, దన్‌సింగ్ నాయక్, రెడ్యానాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని అంకుశాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఫలహారంబండిని ఊరేగించారు. గొర్రెపొట్టెలకు రథం కట్టి మైసమ్మ, పోచమ్మ దేవాలయల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరుణాకర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కె.బుచ్చయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు శ్రీధర్, సభ్యులు అనిల్, గోవర్దన్, బాలస్వామి, ఆనంద్, అశోక్, నర్సింగ్ పాల్గొన్నారు.

-ఘట్‌కేసర్ రూరల్



మండల ఫంక్షన్‌హాలు యజమానుల కమిటి ఎన్నిక

బోడుప్పల్: మేడిపల్లి మండల ఫంక్షన్ హాలు యజమానుల కమిటిని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మేకల బాల్‌రెడ్డి, అధ్యక్షుడిగా బండి శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా బొమ్మక్ బాలయ్య, బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నర్సింగరావు, సంయుక్త కార్యదర్శిగా మహేందర్ యాదవ్, కోశాధికారి బండి నరేందర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా విష్ణు, కార్యవర్గ సభ్యులుగా బాల్‌రెడ్డి, బొమ్మక్ శ్రీనివాస్, బొమ్మక్ శ్రీశైలం, లలిత్ మోహన్, సురేంద్రనాథ్ సింగ్‌లను ఎన్నుకున్నారు.

స్మృతివనానికి స్థల పరిశీలన

ఘట్‌కేసర్ రూరల్: హరితహారం కార్యక్రమంలో భాగంగా ఘటకేసర్ మండలంఅంకుశాపూర్‌లోని స్మృతివనంలో మొక్కలు నాటడానికి మంగళవారం ఎంపీడీవో కల్వకుంట్ల శోభ స్థలాన్ని పరిశీలించారు. సర్వేనెంబర్ 210లో దాదాపు 5 ఏకరాల భూమిలో మొక్కలు నాటడానికి స్థలాన్ని పరిశీలించి, రెవెన్యూ హద్దులు గుర్తించి హద్దురాళ్లను ఏర్పాటు చేయించాలని కార్యదర్శిని ఆదేశించారు. అంకుశాపూర్ సర్వేనెంబర్ 210లో ఐదు ఎకరాల స్థలంలో మొక్కలు నాటడానికి అనువుగా ఉంటుందని భావించారు. అనంతరం కొండాపూర్‌లో హరితహారంలో నాటిన మొక్కలను మండల పంచాయతీ విస్తరణ అధికారి సునంద పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, నరసింహ రావు, వార్డు సభ్యులు లక్ష్మారెడ్డి, రాజు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.


మెగాసైట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో శోభ

'ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి'

కీసర: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. హరితహారం పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు.

పల్లె ప్రగతికి హామీ..!


వికారాబాద్ మండల పరిధిలోని పీరంపల్లి గ్రామం వ్యూ

● పథకాలను సద్వినియోగం చేసుకుంటే గ్రామాలు అభివృద్ధి

వికారాబాద్ అర్బన్ : ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూస్తే ఏ పని కాదు.. అందుబాటులో ఉన్న నిధుల్ని అమలులో ఉన్న పథకాల్ని సద్వినియోగం చేసుకుంటే గ్రామాలు అభివృద్ధి దిశగా అడుగులేస్తాయి. అనుకున్న మేరకు ప్రగతిని సాధించవచ్చు. పంచాయతీలకు మంజూరయ్యే అరకొర నిధులతో ఏ పనులు పూర్తిచేసుకోలేని పరిస్థితి ఉన్నందున సర్పంచులు నిరుత్సాహ పడకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుంటే మేలు జరుగుతుంది. పల్లెలు ప్రగతి బాట పట్టడంతోపాటు కూలీలకు ఉపాధి చూపట్టినట్లు అవుతుంది. వికారాబాద్ మండలంలో 21గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇక్కడ జాబ్‌కార్డులు కలిగిన కూలీలు 8485 మంది ఉన్నారు. 698 శ్రమశక్తి సంఘాలున్నాయి. ప్రస్తుతం రోజువారికి 5350మంది కూలీలు ఉపాధి పథకం పనుల్లో పాల్గొంటున్నారు. వీరి ద్వారా గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం, పర్యావరణ,ం భూగర్భజలాల పెంపు, మౌలిక, సదుపాయాల్ని సమకూర్చుకోవచ్చు. అవసరాలకు తగినట్టు ప్రణాళికను రూపొందించుకుని ముందుకు సాగితే ప్రజల గుండెల్లో నిలిచిపోతారు. గతంలో పోలిస్తే ఉపాధి హామీ పథకంలో కొన్ని మార్పులు చేశారు. గ్రామాభివృద్ధి, వ్యవసాయం తదితర వాటికి ప్రాధాన్యం కల్పించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధికి గల అవకాశాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

స్వచ్ఛ పల్లెలుగా మారుద్దాం..

పల్లెలను సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఉపాధి హామీ పథకంలో అవకాశం ఉంది. చెత్తాచెదారం ఒకచోట నిల్వ చేసేందుకు వీలుగా డంపింగ్ యార్డులను నిర్మించుకోవచ్చు. దీనికి ప్రత్యేకంగా కొంతమంది సిబ్బందిని ఏర్పాటు చేసుకుని వారితో పనులు చేయించుకోవాలి. పైగా గ్రామాల్లోని చెత్తను సేకరించేందుకు నెలకు 15రోజుల చొప్పున ఏడాదిలో 150రోజులు చెత్త రవాణాకు నెలకు నాలుగు పనిదినాల చొప్పున 48రోజులకు ఉపాధి హామీ పథకం కింద వేతనం చెల్లించడానికి వీలుంది. ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యానికి కృషి చేయవచ్చు. దీంతోపాటు ఇళ్లల్లో మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు రూ.12వేలు చెల్లిస్తున్నారు. గతంలో కాకుండా మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన గుంతల్ని ఉపాధి హామీ పథకం కింద తవ్వించుకునే వీలుంది. దీనికి ముందుగా గ్రామాల్లో సర్వేచేసి అవసరమైనవారి వివరాలతో మండల అభివృద్ధి అధికారి నుంచి ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది.

మొక్కలు నాటుదాం..

ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటేందుకు అనేక అవకాశాలున్నాయి. హరితహారంలో భాగంగా గ్రామాన్ని పచ్చదనంతో నింపేయవచ్చు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణం కాపాడడమేకాకుండా ప్రశాంత వాతావరణాన్ని పెంపొందించినవారవుతారు. రైతుల భూములతోపాటు పాఠశాలల్లో రోడ్డుకి ఇరువైపులా పంచాయతీ ఆవరణల్లో మొక్కలు నాటుకోవచ్చు. ఉద్యాన మొక్కలు చల్లని నీడనిచ్చే మొక్కలు, పండ్ల మొక్కలు కూడా అందుబాటులో ఉన్నాయి. మండలాల్లోనే నర్సరీలు ఏర్పాటుచేసి ఉచితంగా మొక్కల సరఫరా చేస్తున్నారు. గుంతలు తవ్వేందుకు మొక్కలు నాటేందుకు వాటి పోషణకు కూడా ఉపాధి హామీ పథకం నుంచి డబ్బు చెల్లిస్తారు. కూలీలను గుర్తించి వారికి బాధ్యతను అప్పగించడంతోపాటు సకాలంలో డబ్బు అందేలా సర్పంచులు పర్యవేక్షిస్తే గ్రామాలు హరితమయమవుతాయి.

సేంద్రియ ఎరువు..

రైతులు సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా ఉపాధి పథకం కింద కంపోస్టు యూనిట్ల ఏర్పాటుకు వీలుగా తవ్వకాలు చేసుకోవచ్చు. ఇందుకు ప్రత్యేకంగా పథకం కింద నిధులున్నాయి. ఆసక్తి గల రైతులను గుర్తించి పొలాల్లో కంపోస్టు గుంతలను ఏర్పాటుచేస్తే సేంద్రియ ఎరువు ఉత్పత్తి చేసుకోవచ్చు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. ఉపాధి పథకం కింద నిధులు కేటాయించే అవకాశం ఉన్న నేపథ్యంలో విరివిగా తవ్వించి సేంద్రియ ఎరువులు ఉత్పత్తి చేసుకునేందుకు వీలుగా రైతుల్ని ప్రోత్సహించవచ్చు. కూరగాయల్ని సాగు చేసేవారు వీటిని ఏర్పాటు చేసుకుంటే నాణ్యమైన ఉత్పత్తులు పండించవచ్చు.

పూడికతీత..

గ్రామాల్లోని చెరువులు, చెక్‌డ్యామ్‌లు, ఊట కుంటలు కాల్వల్లో పూడిక తీసుకునే అవకాశం ఉంది. ఉపాధి హామీ పథకం కింద ప్రతిపాదించి కూలీలతో పనులు చేయిస్తే అటు వారికి ఉపాధి చూడపంతో పాటు నీటి వనరులు బాగవుతాయి. సాగు భూములకు నీరందించడంతోపాటు నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. మిషన్ కాయతీయలో లేని చెరువులు ఇతర చిన్ననీటి వనరుల్ని ఉపాధి హామీ పథకం కింద బాగుచేసుకోవడానికి ఇది సరైన సమయం. నీటి వనరులు ఉన్న గ్రామాల సర్పంచులు వీటిపై దృష్టి సారించి పూర్తిచేయించాలి. రూ.లక్షల వ్యయంతో అయ్యే పనులు కూలీలతో చేయిస్తే వారికి పని కల్పించినట్లవుతుంది.

దారి చూపండి..

గ్రామం నుంచి ఇతర గ్రామాలు, పంట పొలాలు ఇలా దారులు లేని ప్రాంతాలకు ఉపాధి హామీ పథకం కింద రోడ్లు వేసుకునే అవకాశం ఉంది. గ్రామాల వారీగా ప్రాధాన్యమున్న రోడ్లను గుర్తించి వివరాలతో ప్రణాళిక రూపొందించిన ఎంపీడీవో అనుమతి తీసుకోవాలి. గుర్తించిన దారికి ఇరువైపులా మట్టిని తవ్వి రోడ్లు వేసుకోవాలి. ఇలా ఎడ్ల బండ్లు, ఇతర వాహనాలు వెళ్లేందుకు వీలుగా రోడ్డు సౌకర్యం ఏర్పడుతుంది. తర్వాత ఇతర నిధులతో మొరం ఆ తర్వాత బీటీ రహదారులుగా మార్చుకోవచ్చు. ఇందుకుగాను రైతులు ఇబ్బందిపడుతున్న మార్గాలను గుర్తించి వాటిని ఉపాధి హామీ పథకం కింద పూర్తి చేసుకుంటే గ్రామస్థులకు దారి చూపిన వారవుతారు. ఇందులో కొంత కూలీలతోపాటు యంత్రాలకు సంబంధించిన పని ఉండడం వల్ల వాటిని కొంత శాతం మేరకు ఉపయోగించుకునే వీలుంది.

ఇంకుడు గుంతలు..

ఉపాధి హామీ పథకం నిధులతో ఇంకుడు గుంతలు నిర్మించుకోవచ్చు. గ్రామంలోని జాబ్‌కార్డు ఉన్న వారు ఎవరైనా తమ ఇంటి వద్ద ఇంకుడుగుంత నిర్మించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఒక గుంతకు రూ.4095 చెల్లిస్తుంది. వీటిని నిర్మించుకోవడం ద్వారా వృధా నీటిని భూమిలో ఇంకించి ఎద్దడిని నివారించవచ్చు. దీని ద్వారా కూలీలకు పనితోపాటు భూగర్భంలో నీటి మట్టం పెంచుకోవచ్చు.

నీటి నిల్వ..

వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు అనేక అవకాశాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ భూముల్లో కాంటూరు కందకాలు, మినీ ఊట కుంటలు, నీటి నిల్వ కందకాలు ఫాంపండ్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి వీలుంది. గ్రామ సమీపంలో నీటిని ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుంది. ఎక్కడెక్కడ ఎవరి భూముల్లో నిర్మించాలనేది ముందుగా గుర్తించి ప్రతిపాదనలు రూపొందించుకుంటే పకడ్బందీగా పనులు పూర్తిచేసుకోవడానికి వీలుంది. 75 మీటర్ల పొడవు అవసరమైన మేరకు లోతు నిర్మించుకోవచ్చు. గ్రామంలో ఎన్ని ఎక్కువ నిర్మించుకుంటే అంత నీరు భూమిలో ఇంకుతుంది.

ప్రైవేట్ విద్య కలేనా.?



● విద్యాహక్కు చట్టం కింద ఊసేలేని 25 శాతం సీట్ల కేటాయింపు
● పేదలకు ప్రైవేట్ విద్య అందని ద్రాక్షేనా.?
● యథేచ్ఛగా ఫీజుల వసూళ్లు
● పట్టించుకోని అధికారులు

పరిగి: విద్యాహక్కు చట్టం ప్రకారం బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య అందించాల్సి ఉంది. అయితే ఈ చట్టం వచ్చి ఏడేళ్లు కావస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నేరవేరడం లేదు. ప్రత్యేకించి ప్రైవేట్ విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కల్పించాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. ఈ చట్టం అమలు జరిగితే ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో పేదల పిల్లలకు చదువు కల నేరవేరనుంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్పందించి అమలు చేయాలని పేద పిల్లల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన రోజు కూడా పేదలకూ ఉచిత విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పిన సంగతి విధితమే. గత ఏడాది దేశ సర్వోన్నత న్యాయస్థానం అప్పటీ కేంద్ర ప్రభుత్వంపై మెట్టికాయలు వేసిన ఫలితం లేకుండా పోయింది. అయినా అమలులో అందనంతా దూరంగా ఉంది. విద్యాహక్కు చట్టాన్ని ఖచ్చితంగా బాధ్యాతాయుతంగా నిర్వహించాల్సిన అధికార యంత్రాంగం వైఫల్యం వల్లనే ఈ చట్టం అమలుకు నోచుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. న్యాయస్థానం ఆదేశించడం వల్ల విద్యా సంవత్సరం అమలు జరుగుతుందని ఆశించారు కానీ, ఆశలు నిరాశాలుగానే మిగులుతున్నాయి. 2017-18 విద్యాసంవత్సరం ప్రారంభమైంది. అయితే అంతకు ముందుగానే జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థలన్ని తమ సీట్లన్నింటిని ప్రైవేట్ ఫీజులతో భర్తీ చేసుకుంటున్నాయి. కొన్ని విద్యా సంస్థలు నిబంధనలకు మించి కూడా ఎక్కువగా చేసుకుంటున్నాయి. అయితే ఎక్కడా కూడా ఉచితంగా పేదలకు సీట్లు ఇచ్చిన దాఖలాలు లేవు. అయితే దీనిపై ఏడాది కాలం ప్రభుత్వం నాన్చుడిదోరణిని అవలంభించడం కూడా ఒక కారణమని విద్యారంగా విశ్లేషకులు బావిస్తున్నారు. ఫలితంగా పేద విద్యార్థులకు ప్రైవేట్ విద్యను అందని ద్రాక్షలా మారిపోతుందని చెప్పవచ్చు.

అమలైతే వేలాది మందికి లబ్ధి

న్యాయస్థానం తీర్పును అనుసరించి కేంద్రప్రభుత్వం తక్షణమే దీనిపై మార్గదర్శకాలు జారీచేస్తే జిల్లాలో వేలాది మంది పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో వందకుపైగా ప్రైవేట్ విద్యా సంస్థలు ఉంటాయి. వీటి పరిధిలో దాదాపుగా 40వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతుంటారు. అయితే వీటి వల్ల 25 శాతం సీట్లు పేద పేద విద్యార్థులకోసం కేటాయిస్తే దాదాపుగా పదివేల మంది విద్యార్థులకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుంది. ఇందులో కూడా రిజర్వేషన్ల వారిగా ఎంపిక చేయాలని సూచించింది. విద్యాహక్కు చట్టం నిర్దేశించిన విధంగా అనాథలు, ఎయిడ్స్ బాధితులకు ఐదు శాతం. ఎస్సీలకు 10 శాతం, గిరిజనులకు నాలుగుశాతం, బీసీలకు ఆరుశాతం సీట్లను కేటాయించింది. ఈ విద్యార్థుల ఎంపిక విద్యాశాఖ అధికారులు, పాఠశాల యజమాన్యాల నిర్వహణ కమిటీ సమక్షంలో ఎంపిక చేయాల్సి ఉంటుంది. విద్యార్థుల ఎంపిక గురించి గతంలో సుప్రీం కోర్టు కూడా సూచించింది. దీనికితోడు ఈ పిల్లలను ఇతర విద్యార్థులతో సమానంగా కూర్చోబెట్టడంతోపాటు, అన్ని రకాల వసతులన్ని సరి సమానంగా అందించాల్సి ఉంటుంది. అయితే కేవలం వ్యాపార దృక్పథంతో పని చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు దీన్ని అసలు పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ పాటశాలల్లో ఫీజుల నియంత్రణపై ప్రతి ఏడాది ప్రత్యేక టాస్క్‌పోర్సు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నది. ఈ కమిటీ సిపార్సుగానే మిగిలిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

విద్యహక్కు చట్టాన్ని అమలు చేయాలి



ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం పేద విద్యార్థులు ఉచిత విద్యను అందించాలని నిబంధనలు ఉన్నప్పటికీ జిల్లాలోని ఏ ఒక్క పాఠశాల కూడా అమలు చేయడం లేదు. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులను ఫీజుల పేరిటి దోపిడీకి గురి చేస్తున్నాయి. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తే జిల్లాలో 10 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. జిల్లా కలెక్టర్, డీఈవో ఈ విషయంపై చొరవ తీసుకుని ఖచ్చితంగా చేస్తే పేదల విద్యార్థులకు లాభం జరుగుతుంది.

-లాల్‌కృష్ణప్రసాద్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు

మొహం చాటేసిన వరుణుడు



బొంపల్లితండాలో ఎండుతున్న మొక్కజొన్న

నీరుచేరని జలాశయాలు

ఎండుతున్న పంటలు

ఆందోళనలో అన్నదాతలు

పరిగి: ఖరీఫ్‌లో ఇప్పటి వరకు సాధారణానికి మించిన వర్షపాతం నమోదైనప్పటికీ రైతుల్లో కలవరం మొదలైంది. వాతావరణంలో మార్పులు, చిన్నపాటి వర్షం కురుస్తున్నప్పటికీ పంటలకు సరిపోవడం లేదు. నల్లరేగడి భూముల్లో పంటలు కాస్త బాగున్నప్పటికీ చెలక భూముల్లో మొక్కజొన్న తదితర పంటలు ఎండుముఖం పడుతున్నాయి. జూన్‌లో కుసిరిసిన వర్షాలు, జూలైలో కానరాకుండా పోయాయి. ఖరీఫ్ ప్రారంభం నుంచి మేఘాలు కుమ్ముకుని ఊరిస్తూ చిన్నపాటి వర్షాలే తప్పా, వాగులు పారే వర్షాలు కురియలేదు. జిల్లాలో అక్కడక్కడ వానలు కురుస్తున్నా పరిగి నియోజకవర్గంలో మాత్రం చినుకు జాడ లేకుండా పోయింది. అన్నదాతల ఆశల్లో వరుణుడు నిప్పులు చల్లుతున్నాడు. మొదట్లో కురిసిన వానలకు నల్లరేగడి, చెలక నేలల్లో రైతులు విత్తుకున్నారు. కలుపు తీత పనులు కూడా అయిపోయాయి. పంటలన్నీ ఏపుగా కనిపిస్తున్నాయి. వర్షం లేక నేలకొరుగుతున్నాయి. పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో జొన్న, మొక్కజొన్న, పత్తి సాగు సాధారణం కంటే ఎక్కువగానే చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పూడూరు, పరిగి మండలాల్లో కొన్ని రోజుల వరకు తట్టుకుంటాయి కానీ, దోమ, కులకచర్ల మండలాల్లో మొక్కజొన్న, జొన్న, పత్తి పంటలు ఎండిపోతున్నాయి. దోమ మండలం బాసుపల్లి, బొంపల్లి, గోడుగోనిపల్లి, మోత్కూర్, మైలారం, కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్, కామునిపల్లి, అంతారం, పుట్టపహాడ్, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. మరో వారం రోజులు వానలు కురియకపోతే ప్రధానంగా మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. వానదేవుడు కురుణిస్తాడేమోనని అన్నదాతలు ఆకాశంవైపు ఎదురు చూస్తున్నారు.


చుక్కనీరు లేని పుట్టపహాడ్ చెరువు

ఊరిస్తున్న మేఘాలు.. జాడలేని చినుకులు

ఊరిస్తున్న మేఘాలు, ముదురుతున్న ఎండలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా సన్నపాటి వర్షాలు కాపాడుతూ వస్తున్నాయి. చిన్నపాటి వర్షాలకు ఏ ఒక్క చెరువు కుంటల్లోకి నీరు చేరిన దాఖలాలు లేవు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ సీజన్ జూన్ మాసంలో కురిసిన వర్షాలకు ఆరుతడి పంటలను రైతులు సాగు చేశారు. తీరా జూలై నుంచి ఇప్పటి వరకు పరిస్థితి తలకిందులైంది.

వెలవెలబోతున్న చెరువులు, కుంటలు

పరిగి సబ్ డివిజన్‌లోని పరిగి, దోమ, కులకచర్ల మండలాల్లో 200లకుపైగా చెరువు, కుంటలు ఉన్నాయి. గత సంవత్సరం కూడా వర్షాలు ఆశించిన స్థాయిలో కురువక చెరువు, కుంటలు నిండలేదు వాటి కింద పంటల సాగుకు నోచుకోలేదు. చెరువుల కింద ఈ సారి కూడా పంట సాగుబాటుకు నోచుకునే పరిస్థితి లేదు. వర్షాలు కురవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. సబ్ డివిజన్‌లోని ప్రధానంగా లక్నాపూర్, అంతారం పాటిమీద చెరువు, రాయన్‌చెరువు, ఇబ్రహీంపూర్, దోమ పెద్దచెరువు, ఐనాపూర్, కిష్టాపూర్, ముజాహిద్, కులకచర్ల తదితర చెరువుల్లో ఇంకా నీరు చేరలేదు. అయితే ఆయా గ్రామాల్లోని రైతులు వరుణుడి కోసం పూజలు చేస్తున్నారు.


వర్షం కోసం భజన చేస్తున్న మహిళలు

వర్షాల కోసం పూజలు..

కొడంగల్: వర్షాలు కురవాలి వరుణ దేవుడా...పంటలు సమృద్ధిగా పండాలి వరుణుడా అంటూ భజనలతో వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని వడ్డర్‌గల్లీ చితారుపెరుమాళ్ల ఆంజనేయస్వామి భజన మండలి తదితర కాలనీలకు చెందిన ప్రజలు వర్షాల కోసం కొడంగల్ నుంచి సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయం వరకు భజనతో వరుణ దేవుడిని స్మరిస్తూ తరలి వెళ్లారు. ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి వరుణ దేవుడిని ప్రార్థించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలతో పాటు భజనలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు సాగు చేసిన పంటలు వర్షాలు లేక ఎండుముఖం పట్టడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దాదాపు 20 రోజులకుపైగా వర్షాలు కురవకపోవడంతో సాగు చేసిన పంటలు నష్టానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు వివిధ గ్రామాల్లో వరుణ దేవుడి కరుణ కోసం భజనలతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

మొక్కజొన్న ఎండిపోతున్నది

మంత్రి మహిపాల్, రైతు, బాసుపల్లి



మొదట్లో వర్షాలు మురిపించాయి. ఆశతో పంటల సాగుకు వేలాది రూపాయల అప్పులు చేసి మొక్కజొన్న సాగు చేశా. పంట ఏపుగా వచ్చి మురిపిస్తున్నది. వర్షాకాలం ఉసూరు మనడంతో పంటలు ఎండుముఖం పట్టాయి. రెండు, మూడు రోజుల్లో వర్షం కురిస్తే పంట ఉంటుంది. ఆలస్యం అయితే పంటలపై ఆశలు వదులుకోవాల్సిందే.

నేటినుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

జోనల్ స్థాయి ఆటల నిర్వహణకు రంగం సిద్ధం

వారాంతం వరకు సాగనున్న పోటీలు

వికారాబాద్ ఫీచర్స్ : జిల్లాలో నేటి నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడల సందడి మొదలు కానుంది. బుధవారం నుంచి వారం రోజుల పాటు ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు సంబంధిత అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ తదితర క్రీడా విభాగాల్లో ఆయా మండలాల నుంచి వచ్చే జట్లకు పోటీలను నిర్వహించనున్నారు. ఈ క్రీడల నిర్వహణకు సౌలభ్యంగా ఉండేందుకు క్రీడాశాఖ అధికారులు జిల్లాలోని 18 మండలాలను వికారాబాద్, పరిగి, ధారూరు, కొడంగల్, తాండూరు, మోమిన్‌పేట్ జోన్లుగా విభజించారు. మొత్తం 6 జోన్లు ఉండగా ఒక్కో జోన్ పరిధిలో మూడేసి మండలాలున్నాయి. పోటీలు ముగిశాక సంబంధిత మండలాల నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సంబంధిత క్రీడల్లో జోన్ జట్లకు ఎంపిక చేస్తారు.

క్రీడల నిర్వహణలో కొత్త విధానం

జిల్లాల పునర్విభజనకు ముందు ఉమ్మడిగా ఉన్న రంగారెడ్డి జిల్లాలో ప్రతీ నియోజకవర్గాన్ని ఓ జోన్‌గా భావించే వారు. అప్పట్లో ముందుగా జోన్‌ల వారీగా క్రీడలను నిర్వహించి తర్వాత నేరుగా రంగారెడ్డి జిల్లా స్థాయిలో క్రీడలను నిర్వహించే వారు. అనంతరం 10 జిల్లాల జట్లతో రాష్ట్ర స్థాయి క్రీడల నిర్వహణ జరిగేది. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో 31 జిల్లాలు ఉండడంతో కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లాలో గల 6 జోన్లలో ముందుగా క్రీడలను నిర్వహిస్తారు. అనంతరం జోన్లవారీగా ఆయా క్రీడల్లో ఎంపికైన జట్లనన్నింటినీ కలిపి వికారాబాద్ జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహిస్తారు. ఇందులో క్రీడాకారులు కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఆయా విభాగాల్లో వికారాబాద్ జిల్లా జట్టును ఎంపిక చేస్తారు. ఇదే తరహాలో ఎంపిక చేసిన రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల జట్లతో వికారాబాద్ జిల్లా జట్లను కలిపి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి క్రీడలను నిర్వహిస్తారు. ఆ పోటీల్లో ప్రతిభ ఆధారంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్లను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తారు. అన్ని రకాల క్రీడలకూ ఇదే పద్ధతి పాటిస్తారు.

రెండో వారంలో వికారాబాద్ జిల్లా స్థాయి క్రీడలు

ఆగస్టు మొదటి వారంలో జోనల్ స్థాయి క్రీడలు ముగిశాక రెండు లేదా 3వ వారంలో వికారాబాద్ జిల్లా స్థాయి క్రీడలను నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ పోటీలు ముగిశాక ఆగస్టు చివరికల్లా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడానికి సన్నద్ధమవుతున్నారు. అయితే పరిస్థితులను బట్టి షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది.

ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మోడల్ - 1

1. **చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక**
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. **విటమిన్ ఎ : రేచీకటి :: ----- : రికెట్స్**
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. **పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----**
ఎ) కెరోటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. **ధర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : -------**
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : ఎ
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం ధర్మామీటర్. అలాగే విద్యుత్‌ను కొలిచేది అమ్మీటర్

5. **రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: -------**
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: సి
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. **పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------**
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్‌టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: పక్షులను గురించి వివరించే శాస్త్రం ఆర్నిథాలజీ. అదేవిధంగా హృదయ స్పందన గురించి వివరించే శాస్త్రం కార్డియాలజీ

7. **రైతు : నాగలి :: సైనికుడు: ---------**
ఎ) తుపాకి బి) కత్తి సి) సూది డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: నాగలిని ఉపయోగించే వ్యక్తి రైతు. అదేవిధంగా తుపాకిని ఉపయోగించే వ్యక్తి సైనికుడు

8. **పాల స్వచ్ఛత: లాక్టోమీటర్ :: భూకంపాలు: ---**
ఎ) బారోమీటర్ బి) అనిమోమీటర్
సి) ఆడో మీటర్ డి) సిస్మోగ్రాఫ్
సమాధానం: డి
వివరణ: పాల స్వచ్ఛతను కొలిచే పరికరం లాక్టోమీటర్. అలాగే భూకంప తీవ్రతను కొలిచే సాధనం సిస్మోగ్రాఫ్

9. **బలం: వాట్ :: విద్యుత్ : --------**
ఎ) జౌల్ బి) డిగ్రీ సి) ఆంపియర్ డి) సెకండ్స్
సమాధానం: సి
వివరణ: బలానికి ప్రమాణం వాట్ అలాగే విద్యుత్‌కు ప్రమాణం ఆంపియర్

10. **ముఖేష్: హాకీ :: చెస్ : -------**
ఎ) గగన్ నారంగ్ బి) హరి కృష్ణ
సి) లక్ష్మణ్ డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ముఖేష్ హాకీ క్రీడాకారుడు. అలాగే హరికృష్ణ చెస్ క్రీడాకారుడు

11. **కొలంబో : శ్రీలంక :: ------ : ఆఫ్ఘనిస్తాన్**
ఎ) ఇస్లామాబాద్ బి) కాబూల్ సి) తింపు డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శ్రీలంక రాజధాని కొలంబో. అలాగే ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్

12. **హస్తినాపురం : న్యూఢిల్లీ :: మద్రాస్ : -----**
ఎ) చెన్నై బి) పనాజి సి) కోల్‌కతా డి) ముంబై
సమాధానం: ఎ
వివరణ: హస్తినాపురానికి కొత్త పేరు న్యూఢిల్లీ, అలాగే మద్రాస్‌కు కొత్త పేరు చెన్నై

13. **భరతనాట్యం: తమిళనాడు :: యక్షగానం: -------**
ఎ) కేరళ బి) మహారాష్ట్ర సి) కర్ణాటక డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: తమిళనాడు శాస్త్రీయ నృత్యం భరత నాట్యం. కర్ణాటక శాస్త్రీయ నృత్యం యక్షగానం

14. **న్యూజిలాండ్ జాతీయ పక్షి : కివి :: మన జాతీయ పక్షి : --------**
ఎ) నెమలి బి) పావురం సి) చిలుక డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: న్యూజిలాండ్ జాతీయ పక్షి కివి అదేవిధంగా మన జాతీయ పక్షి నెమలి.

15. **చార్మినార్: హైదరాబాద్ :: తాజ్‌మహల్:-------**
ఎ) న్యూఢిల్లీ బి) ఆగ్రా సి) మీరట్ డి) ఔరంగాబాద్
సమాధానం: బి
వివరణ: చార్మినార్ హైదరాబాద్‌లో ఉంది. తాజ్‌మహల్ ఆగ్రాలో ఉంది.

16. **ఇండియా : రూపాయి :: జపాన్ : -------**
ఎ) డాలర్ బి) ఫ్రాంక్ సి) యన్ డి) దీనార్
సమాధానం: సి
వివరణ: ఇండియా కరెన్సీ రూపాయి. జపాన్ కరెన్సీ యన్

17. **గ్రహాలు : ఖగోళ శాస్త్రం :: నాణేలు : -----------**
ఎ) సిస్మోగ్రాఫ్ బి) పేలియోగ్రఫీ
సి) పాథాలజీ డి) న్యూమిస్‌మాటిక్స్
సమాధానం: డి
వివరణ: గ్రహాల గురించి వివరించే శాస్త్రం ఖగోళశాస్త్రం. అలాగే నాణేల గురించి వివరించే శాస్త్రం న్యూమిస్‌మాటిక్స్

18. **ఆర్య సమాజం: దయానంద సరస్వతి:: రామకృష్ణ మిషన్: --------**
ఎ) అనిబిసెంట్ బి) స్వామి వివేకానంద
సి) నివేదిత డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి. అదేవిధంగా రామకృష్ణ మిషన్ స్థాపకుడు స్వామి వివేకానంద

19. **స్వామి వివేకానంద: నరేంద్రదత్:: దయానంద సరస్వతి: -------**
ఎ) గదాధరుడు బి) మూల శంకర్
సి) రామచందర్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్ర దత్. దయానంద సరస్వతి అసలు పేరు మూల్ శంకర్

20. **మెగస్తనీస్: ఇండికా:: పాణిని: -----------**
ఎ) అష్టాధ్యాయి బి) హర్ష చరిత్ర
సి) చరక సంహిత డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మెగస్తనీస్ రచించిన గ్రంథం ఇండికా, అదేవిధంగా పాణిని రచించిన గ్రంథం అష్టాధ్యాయి.

21. **పాస్కల్: ఒత్తిడి:: ఆంపియర్: -------**
ఎ) విద్యుత్ బి) బలం సి) శక్తి డి) స్వచ్ఛత
సమాధానం: ఎ
వివరణ: పాస్కల్ అనేది ఒత్తిడికి ప్రమాణం. అలాగే ఆంపియర్ అనేది విద్యుత్‌కు ప్రమాణం

22. **కన్నడం: కర్ణాటక:: మరాఠీ: -------**
ఎ) మధ్యప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) రాజస్థాన్

23. **హాంకాంగ్: చైనా:: వాటికన్: --------**
ఎ) నార్వే బి) డెన్మార్క్
సి) నెదర్లాండ్ డి) రోమ్
సమాధానం: డి
వివరణ: చైనాలోని ఒక నగరం హాంకాంగ్. అలాగే రోమ్‌లోని నగరం వాటికన్ సిటీ

24. **ఇన్సులిన్: హార్మోన్::ట్రిప్సిన్: -------**
ఎ) ఎంజైమ్ బి) విటమిన్ సి) హార్మోన్ డి) గ్రంధి
సమాధానం: ఎ
వివరణ: ఇన్సులిన్ అనేది హార్మోన్. అలాగే ట్రిప్సిన్ అనేది ఒక ఎంజైమ్

25. **వినడం: చెముడు:: మాట్లాడడం: --------**
ఎ) నిశ్శబ్దం బి) మూగ సి) శాంతి డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: వినలేకపోవడం చెముడు అలాగే మాట్లాడలేకపోవడం మూగ

26. **భాక్రానంగల్: సట్లెజ్:: హీరాకుడ్ : -------**
ఎ) గోదావరి బి) కృష్ణ సి) కావేరి డి) మహానది
సమాధానం: డి
వివరణ: భాక్రానంగల్ డ్యామ్ సట్లెజ్ నదిపై ఉంది అలాగే హీరాకుడ్ డ్యామ్ మహానదిపై ఉంది.

27. **హరిత విప్లవం: మొక్కలు:: నీలి విప్లవం: ------**
ఎ) చేపలు బి) పాలు సి) నూనె గింజలు డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మొక్కల అధికోత్పత్తికి చేపట్టిన కార్యక్రమం హరిత విప్లవం. అలాగే చేపల అధిక దిగుబడికి చేపట్టిన కార్యక్రమం నీలి విప్లవం

28. **తూర్పు: వాయవ్యం:: నైరుతి: ----**
ఎ) ఈశాన్యం బి) తూర్పు సి) ఆగ్నేయం డి) ఉత్తరం
సమాధానం: బి
వివరణ: తూర్పునకు 135 డిగ్రీల అపసవ్యదిశ వాయవ్యం. నైరుతికి 135 డిగ్రీల అపసవ్య దిశ తూర్పు

29. **సత్యజిత్ రే: సినిమా:: పికాసో: ------**
ఎ) రచయిత బి) నాటక కర్త
సి) చిత్రకారుడు డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: సినిమా రంగానికి చెందిన ప్రముఖుడు సత్యజిత్ రే. అలాగే సుప్రసిద్ధ చిత్రకారుడు పికాసో

30. **రెస్టారెంట్: మెను:: లైబ్రరీ: -----**
ఎ) చదువు బి) పుస్తకాలు సి) విద్య డి) క్యాటలాగ్
సమాధానం: డి
వివరణ: మెను అనేది ఐటెమ్స్ లిస్ట్. కేటలాగ్ అనేది బుక్స్ లిస్ట్

31. **ఓనం: కేరళ:: బిహు: ------**
ఎ) కర్ణాటక బి) మిజోరాం సి) అస్సాం డి) ఒడిశా
సమాధానం: సి
వివరణ: కేరళ ప్రజలు చేసుకొనే పండుగ ఓనం. అస్సాం ప్రజలు చేసుకొనే పండుగ బిహు

32. **ప్రమాదం: అజాగ్రత:: వ్యాధులు: -------**
ఎ) అపరిశుభ్రత బి) వైద్యుడు
సి) మందులు డి) వైద్యం సమాధానం: ఎ
వివరణ: అజాగ్రత్తతో ప్రమాదం లభిస్తుంది. అలాగే అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలుతాయి.

33. **శిల్పం: రూపం:: పాట ------**
ఎ) సంగీతం బి) గానం సి) చెప్పలేం డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శిల్పానికి మంచి రూపం ఉండాలి. అలాగే పాటకు మంచి గానం ఉండాలి.

అడ్మిషన్స్

ఐఎన్ఎటి 2017

పుణెలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయుసిఎఎ), నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రో ఫిజిక్స్ (ఎన్‌సిఆర్ఎ) సంస్థల్లో పిహెచ్‌డి చేసే వారికి ఉద్దేశించిన రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ప్రకటన విడుదలైంది.
విభాగాలు: ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఫిజిక్స్
